# పతాకం న్యూస్

APTEL/25/A2082

PATHAKAM NEWS TELEGU DAILY | తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 172 | విశాఖపట్నం | 24-3-2026 మంగళవారం | చీఫ్ ఎడిటర్ : ఎల్. కృష్ణరావు | పేజీలు : 8 | వెల: రూ.5/-

Volume : 01 | Issue : 172 | VISAKHAPATNAM | 24-3-2026 TUESDAY | CHIEF EDITOR: L.KRISHNA RAO | Pages:8 | Rate: Rs.5/-

Visakhapatnam, Srikakulam, Allurisitarama, Rajamahendravaram, Vijayawada, Tirupati, Anathapuram







2లో

## పశ్చిమాసియాలో పరిస్థితి ఆందోళనకరంగా ఉంది.. లోక్‌సభలో ప్రధాని మోడీ



2లో

## ప్రపంచానికి ఏపీ సత్తా చాటిచెప్పే ప్రాజెక్ట్ ఈ స్టీల్‌ప్లాంట్: చంద్రబాబు



6లో

## శరీరానికి ఐరన్ లభించాలంటే..!

# ఆర్సెలార్ మిట్టల్ స్టీల్‌ప్లాంట్‌కు శంకుస్థాపన



**నక్కపల్లి పతాకం న్యూస్:** ఆంధ్రప్రదేశ్‌లో అనకాపల్లి జిల్లా నక్కపల్లి సమీపంలోని రాజయ్యపేటలో అతిపెద్ద స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేస్తున్నారు. రూ.1,35,964 కోట్ల భారీ పెట్టుబడితో ఏర్పాటు చేయనున్న ఆర్సెలార్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ప్లాంట్‌కు సోమవారం సాయంత్రం భూమిపూజ నిర్వహించారు. రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతికి ఈ ప్లాంట్ కీలకం కానుంది. ఈ కార్యక్రమానికి ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామి, కేంద్ర సహాయమంత్రి శ్రీనివాస వర్మ, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్, ఆర్సెలార్ మిట్టల్ అధినేత లక్ష్మీ మిట్టల్, కంపెనీ ప్రతినిధులు, ఉన్నతాధికారులు హాజరయ్యారు. అనంతరం వారు శిలాఫలకం ఆవిష్కరించారు.

అంతకుముందు, స్టీల్ ప్లాంట్ నిర్మాణ నమూనాను లక్ష్మీ మిట్టల్.. సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి కుమారస్వామికి వివరించారు. అనంతరం, నేతలందరూ ప్లాంట్ స్థలంలో ఏర్పాటు చేసిన ఎక్స్‌పీరియన్స్ జోన్‌ను సందర్శించారు.

రాజయ్యపేటలో నిర్మిస్తున్న ఈ ప్లాంట్ ద్వారా ఏడాదికి 17.8 మిలియన్ టన్నుల ఉక్కును ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. నిర్మాణ పనులు పూర్తి చేసి 2029 నుంచి ఉత్పత్తిని ప్రారంభించాలని కంపెనీ ప్రణాళికలు సిద్ధం చేసింది. ఈ భారీ ప్రాజెక్టు రాష్ట్ర పారిశ్రామిక ముఖచిత్రాన్ని మార్చగలదని అంచనా వేస్తున్నారు. దీనిద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు లక్ష మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.

# విశాఖలో లోకేశ్ 'ప్రజాదర్బార్'



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ నిర్వహిస్తున్న 'ప్రజాదర్బార్' 84వ రోజుకు చేరుకుంది. సోమవారం విశాఖపట్నంలో టీడీపీ కార్యాలయం వేదికగా జరిగిన ఈ కార్యక్రమంలో వివిధ వర్గాల ప్రజలు తమ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఆయా సమస్యలను నిశితంగా పరిశీలించి.. త్వరలోనే పరిష్కరిస్తానని లోకేశ్ భరోసా కల్పించారు. ప్రజల సమస్యలను నేరుగా విని, వాటిని పరిష్కరించే లక్ష్యంతో 'ప్రజాదర్బార్' కార్యక్రమం కొనసాగుతోంది. ఈ కార్యక్రమంలో ఈరోజు పలు కీలక వినతులను వివిధ వర్గాల ప్రజలు మంత్రి లోకేశ్‌కు అందజేశారు. ఆంధ్రా యూనివర్సిటీలో మినిమం టైమ్ స్కేల్ మీద పనిచేస్తున్న ఉద్యోగులు మంత్రి లోకేశ్‌ని కలిశారు. తమ పదవీ విరమణ వయోపరిమితిని 62 ఏళ్లకు పెంచాలని వారు కోరారు. విశాఖపట్నం ఎయిర్‌పోర్టులో పనిచేస్తున్న పోర్టర్లు తమ భవిష్యత్తుపై ఆందోళన వ్యక్తం చేశారు. త్వరలో ప్రారంభం కానున్న భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయంలో తమ సేవలను ఉపయోగించుకోవాలని, తమకు ఉపాధి కల్పించాలని మంత్రి లోకేశ్‌కు వినతిపత్రం సమర్పించారు.

## భారత్‌కు భారీ ఊరట.. హర్మూజ్ జలసంధిని దాటిన ఎల్‌పీజీ నౌకలు



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** పశ్చిమాసియాలో యుద్ధం తీవ్రస్థాయికి చేరినప్పటికీ భారత్‌కు ఇంధన సరఫరా విషయంలో పెద్ద ఊరట లభించింది. సుమారు 92,700 మెట్రిక్ టన్నుల వంటగ్యాస్‌తో వస్తున్న రెండు భారీ భారతీయ నౌకలు 'పైన్ గ్యాస్', 'జగ్ వసంత్' హర్మూజ్ జలసంధిని సురక్షితంగా దాటాయి. ఈ నౌకలు ప్రస్తుతం గుజరాత్‌లోని ముంద్రా, కాండ్లా రేవుల వైపు ప్రయాణిస్తున్నాయి. భారత్‌తో ఉన్న బలమైన దౌత్య సంబంధాల కారణంగా ఇరాన్ ఈ నౌకలకు ప్రత్యేక అనుమతి ఇవ్వడం విశేషం. ఇరాన్ నౌకాదళం ఈ నౌకలకు మార్గనిర్దేశం చేసి భద్రత కల్పించింది. యుద్ధ వాతావరణం నెల

(తరువాయి 2వ పేజీలో)

## అమరావతిలో ప్రపంచ స్థాయి ప్రమాణాలతో ఐకానిక్ కట్టడాలు: నారాయణ



**అమరావతి, పతాకం న్యూస్:** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణ పనులపై రాష్ట్ర మున్సిపల్, పరిపాలన శాఖ మంత్రి పొంగూరు నారాయణ (ఞూ వీఱఅఱర్‌వతీ చీఖతీఖఋఖఅఖ) కీలక అప్‌డేట్స్ ఇచ్చారు. అసెంబ్లీ, హైకోర్టు, సెక్రటేరియట్ టవర్లను ప్రపంచ స్థాయి ప్రమాణాలతో ఐకానిక్ కట్టడాలుగా నిర్మిస్తున్నామని స్పష్టం చేశారు. ఏపీ రాజధాని అమరావతి నిర్మాణంలో భాగంగా నిర్మిస్తున్న ఐకానిక్ భవనాల విశిష్టతను, నిధుల సమీకరణను మంత్రి నారాయణ వివరించారు. అమరావతి అసెంబ్లీ భవనాన్ని 250 మీటర్ల ఎత్తులో నిర్మిస్తున్నామని తెలిపారు. ఈ భవనంపైకి ప్రజలు వెళ్లి మొత్తం అమరావతి నగరాన్ని వీక్షించేలా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు.

## హైదరాబాద్‌ను మూడు ప్రత్యేక జోన్లుగా విభజిస్తున్నాం: రేవంత్‌రెడ్డి



2లో

## ఇరాన్‌తో యుద్ధాన్ని తాత్కాలికంగా ఆపేస్తున్నాం: ట్రంప్



**న్యూయార్క్:** పశ్చిమాసియాలో యుద్ధానికి తాత్కాలికంగా బ్రేక్ పడింది. ఈ మేరకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన ప్రకటన చేశారు. ఇరాన్‌పై యుద్ధాన్ని తాత్కాలికంగా ఆపేస్తున్నామని ఆయన తన ట్రూత్ సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు. 5 రోజుల పాటు యుద్ధాన్ని నిలిపివేస్తున్నామని వెల్లడించారు. ఇరాన్ విద్యుత్ కేంద్రాలపై దాడులు ఆపేస్తున్నట్లు చెప్పారు. రెండు రోజులుగా ఇరాన్‌తో జరిగిన చర్చలు సానుకూలంగా సాగాయని పేర్కొన్నారు. "గత1 రెండు రోజులుగా అమెరికా, ఇరాన్ మధ్య చర్చలు సానుకూలంగా జరిగాయని చెప్పడానికి నేను సంతోషిస్తున్నాను. ఇరుదేశాల మధ్య

(తరువాయి 2వ పేజీలో)


పతాకం న్యూస్ APTEL/25/A2082 PATHAKAM NEWS TELEGU DAILY తెలుగు దినపత్రిక

ధర్మం కోసం పోరాటం చేస్తున్నా..
అవినీతి, అక్రమాలను బయటకు తీస్తున్నా..
పతాకం న్యూస్‌కు సహకరించగలరు

సంవత్సరం చందా రూ. 2000

PATHAKAM NEWS
State Bank of India
A/c No: 44576280686
IFSC:SBIN00021297
DUVVADA BRANCH

పతాకం న్యూస్
APTEL/25/A2082
PATHAKAM NEWS TELEGU DAILY
తెలుగు దినపత్రిక

# సంపాదకీయం

## గండం!

మానవాళి మనుగడకు నీరే ప్రాణాధారం. జల భద్రతతోనే భవిత సురక్షితం. నీరు లేకుండా జీవం లేదు. నీటి లభ్యత వున్న నదీ పరివాహక ప్రాంతాలు, తీరప్రాంతాల్లోనే ప్రాచీన నాగరికతలు, ఆధునిక సమాజాలు అభివృద్ధి చెందాయి. ఇది మానవ ఆవాసాల స్థిరత్వానికి మూలాధారం. 'నీటి పేరు వింటేనే నిలువునా తడిసిపోతాం/ నీరంటేనే జలజలలాడి పోతాం/ నీటితనంతో ప్రాణులం/ నిత్యజీవన తేజో విరాజితులమౌతాం' అంటారు డాక్టర్ ఎన్.గోపి 'జలగీతం' దీర్ఘకవితలో. నీరు వున్నా...శుద్ధంగా లేకపోతే జీవితం లేదు. అత్యంత విలువైన ప్రకృతి వనరులలో నీరు ఒకటి. అత్యంత అజాగ్రత్తగా, నిర్లక్ష్యంగా వాడే వనరులలో ప్రధానమైనదీ నీరే. 'జలమే జీవం' అని పెద్దలు చెప్పిన మాట... ఇప్పుడో హెచ్చరిక. జనాభా పెరుగుదల కారణంగా నీటి లభ్యత లేని ప్రాంతాల్లో సమాజం తీవ్రమైన నీటి ఒత్తిడిని ఎదుర్కొంటోంది. ఇది సామాజిక, ఆర్థిక అభివృద్ధిని ప్రభావితం చేస్తున్నది. ప్రపంచంలో నయా ఉదారవాద ఆర్థిక విధానాలు పురుడు పోసుకున్నాక నీటి ఆవశ్యకతపై చర్చ మొదలైంది. భవిష్యత్తరాలకు సురక్షిత నీటిని అందించాలన్న లక్ష్యం మొలకెత్తింది. నీటిని సంరక్షించుకోకపోతే, భవిష్యత్ అంధ కారమౌతుందని, జీవకోటి మనుగడ ప్రశ్నార్థకమౌతుందని భయాందోళనలు అలముకున్నాయి. భవిష్యత్‌లో ఎదురయ్యే నీటి సంక్షోభాలను అధిగమించేందుకు, ప్రజల్లో అవగాహన కల్పించే ఉద్దేశ్యంతో ప్రతి యేటా మార్చి 22న 'ప్రపంచ జల దినోత్సవం' నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది 'నీరు-జెండర్' అనే థీమ్‌ను ఐరాస రూపొందించింది. 'నీరు ప్రవహించే చోట, సమానత్వం పెరుగుతుంది' అనే నినాదంతో నీటి చైతన్యం పెంపొందించే ప్రయత్నం చేస్తోంది. ఈ సందర్భంగా... సమస్యకు మూలమెక్కడీ కారకులెవరు? లబ్ధి పొందు తున్నదెవరు? బాధితులెవరు? అన్న సత్యాన్ని విస్మరించ కూడదు. ఐరాస అంచనా ప్రకారం... నేటికీ ప్రపంచ వ్యాప్తంగా 200 కోట్ల మందికి పైగా ప్రజలకు రక్షిత తాగునీరు అందుబాటులో లేదు. ఈ సంఖ్య వెనుక అత్యంత బాధితులుగా వుండేది మహిళలే. ఐరాస, డబ్లుహెచ్‌ఓ, యునెస్కో, యూఎన్ ఉమెన్, భారత జలశక్తి మంత్రిత్వ శాఖ గణాంకాల సహితంగా నమోదైన వాస్తవం ఇది. ప్రపంచవ్యాప్తంగా మహిళలు, బాలికలు ప్రతిరోజూ నీటి సేకరణకు 25 కోట్ల గంటలు వెచ్చిస్తున్నారు. ఇది పురుషులు, బాలుర కంటే మూడురెట్లు ఎక్కువ. ప్రతిరోజూ 20కోట్ల మంది భారతీయులు సుదూరాలు నడిచివెళ్లి నీటిని తెచ్చుకుంటున్నారు. వీరిలో అత్యధికులు మహిళలు, బాలికలే. ఐదేళ్లలో గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి ఇంటికీ కొళాయి ద్వారా రక్షిత మంచినీరు అందిస్తామని 2019లో ఆర్భాటంగా 'జల్ జీవన్ మిషన్' పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రారంభించింది. ఈ పథకం 2024 నాటికి పూర్తికావాల్సి వుండగా, చాలా రాష్ట్రాల్లో అసలు అమలుకే నోచుకోలేదు. దీంతో ఈ పథకం కాలపరిమితిని 2028 వరకూ పొడిగించడంతో పాటు, కేటాయింపులను కూడా రూ.8.69 లక్షల కోట్లకు పెంచుతూ ఇటీవల ప్రధాని మోడీ అధ్యక్షతన కేంద్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే వేసవి మొదలు కావడంతో దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాల్లో తాగునీటి కొరత తీవ్రమైంది. 2030 నాటికి దేశంలోని 21 ప్రధాన నగరాల్లో భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటే ప్రమాదం వుందని గణాంకాలు చెబుతున్నాయి. పర్యావరణ విధ్వంసం కూడా దీనికి ప్రధాన కారణం. జల నాణ్యత సూచీలో 122 దేశాలలో భారత్ 120వ స్థానంలో వుంది. మనం భూగర్భ జలాలను, నీటి వనరులను కోల్పోవడమే కాదు, ఉన్న నీటిని కూడా విష పూరితం చేస్తున్నామని అనేక నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. స్వచ్ఛమైన నీరు అందించడం ప్రభుత్వాల బాధ్యత. ప్రజల ప్రాథమిక హక్కులను కూడా కాపాడలేని పరిస్థితిలో ప్రభుత్వాలున్నాయి. దేశంలో ఏటా 3.77 కోట్ల మంది కలుషిత నీటి వల్ల వ్యాధుల బారిన పడుతున్నారు. డయే రియా వంటి వ్యాధులతో ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ ఏడాది మొదట్లోనే ఇండోర్‌లో కలుషిత నీటితో 15 మంది మరణించిన సంగతి తెలిసిందే. లక్ష్యాలు గొప్ప వుంటే సరిపోదు, వాటి అమలు కూడా అంతే గొప్పగా వుండాలి. కాగితాలపై కనిపించే ప్రణాళికలు ఆచరణలో అమలుకు నోచుకోవాలి. పారదర్శకత లేని వ్యవస్థలో ప్రజా ప్రయోజనం కనిపించదనేది నిజమని ఎప్పటికప్పుడు రుజువౌతూనే వుంది. 'చిన్న ఝరం గిరులు దూకి జీవనదిగ మారినట్లు/ ...చుక్క ఎదిగి ఎదిగి పూర్ణ సుధాంశునిగ మారినట్లు/ ...సరసి మహాతపమొనర్చి సంద్రంగా మారినట్లు' అంటారు సినారె. ఇదేవిధంగా, జల్ జీవన్ మిషన్ సహా ప్రభుత్వ నీటి పథకాలన్నిటినీ చిత్తశుద్ధితో అమలు చేస్తే, బొట్టు బొట్టు భద్రం చేస్తే.. ప్రజలు నీటి గండం నుంచి గట్టెక్కుతారు.

## హైదరాబాద్‌ను మూడు ప్రత్యేక జోన్లుగా విభజిస్తున్నాం: రేవంత్‌రెడ్డి



**హైదరాబాద్, పతాకం న్యూస్:** పెరుగుతున్న జనాభా, వాహనాల రద్దీకి అనుగుణంగా హైదరాబాద్ నగరాన్ని అద్భుత నగరంగా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. శాసనమండలిలో అభివృద్ధిపై జరిగిన చర్చలో పాల్గొన్న ఆయన, భవిష్యత్ అవసరాల దృష్ట్యా నగరాన్ని మూడు ప్రత్యేక జోన్లుగా విభజిస్తున్నట్లు వెల్లడించారు. క్యూర్, ప్యూర్, రేర్ విభాగాలుగా ఈ ప్రణాళిక సాగనుంది. నగరంలోని కాలుష్యాన్ని తగ్గించేందుకు ఓఆర్ఆర్ లోపల ఉన్న పరిశ్రమలన్నింటినీ వెలుపలికి తరలిస్తామని ఆయన స్పష్టం చేశారు. ట్రాఫిక్ రద్దీని తగ్గించడమే లక్ష్యంగా అండర్‌పాస్‌లు, సర్ఫేస్ రోడ్లు మరియు భారీ ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టబోతున్నట్లు సీఎం తెలిపారు. ముఖ్యంగా శామీర్‌పేట, మేడ్చల్ వైపు వెళ్లే ప్రయాణికుల కోసం ప్రత్యేక కారిడార్లు నిర్మిస్తామని, దీని కోసం కేంద్ర ప్రభుత్వ సంస్థలతో మాట్లాడి భూసేకరణ చేస్తున్నామని పేర్కొన్నారు. మెట్రో రైలు విస్తరణకు ఎల్ అండ్ టీ సంస్థ ముందుకు రాకపోవడంతో కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రభుత్వమే రూ.15 వేల కోట్లు కేటాయించి మెట్రోను స్వాధీనం చేసుకుందని, త్వరలోనే మరో 76 కిలోమీటర్ల మేర మెట్రోను విస్తరిస్తామని భరోసా ఇచ్చారు. నగర సుందరీకరణలో భాగంగా మూసీ నది పునరుజ్జీవనంపై ప్రత్యేక దృష్టి పెట్టామని, డ్రైనేజీ వ్యవస్థను ఆధునికీకరిస్తే మూసీ సుందరీకరణ వేగంగా పూర్తవుతుందని రేవంత్ రెడ్డి వివరించారు. అలాగే 30 వేల ఎకరాల్లో అత్యాధునిక 'ఫ్యూచర్ సిటీ'ని నిర్మిస్తున్నట్లు తెలిపారు. అభివృద్ధి విషయంలో రాజకీయాలకు తావులేదని, గతంలో గుజరాత్ అభివృద్ధి కోసం అన్ని పార్టీలు ఎలాగైతే కలిశాయో, హైదరాబాద్ అభివృద్ధి కోసం కూడా ప్రతిపక్షాలు కలిసి రావాలని ఆయన పిలుపునిచ్చారు.

## కార్పొరేట్ చట్టాల (సవరణ) బిల్లును ప్రవేశపెట్టిన నిర్మలా సీతారామన్



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** సోమవారం లోక్‌సభలో కార్పొరేట్ చట్టాల (సవరణ) 2026 బిల్లును కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టారు. సమగ్ర పరిశీలన కోసం ఈ బిల్లును జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జెపిసి)కి పంపాలన్న తీర్మానాన్ని లోక్‌సభ ఆమోదించింది. ఈ బిల్లు పరిమిత బాధ్యత భాగస్వామ్య చట్టం 2008, కంపెనీల చట్టం 2013లకు మరిన్ని సవరణలను కోరుతోంది. ఈ బడ్జెట్ సమావేశాల్లోనే 2026-27 ఆర్థిక సంవత్సరానికి కేంద్ర ప్రభుత్వ ఆర్థిక ప్రతిపాదనలను వివరించే ఫైనాన్స్ బిల్లు 2026ను కూడా పరిశీలన కోసం ఆర్థికమంత్రి ప్రవేశపెట్టనున్నారు. కాగా, నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన కార్పొరేట్ చట్టాల (సవరణ) బిల్లును ప్రవేశపెట్టడానిన కాంగ్రెస్ ఎంపి మనీష్ తివారీ వ్యతిరేకించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 245-246ను ఉల్లంచి ఈ బిల్లులో ముఖ్యమైన శాసన విధులను మితిమీరి అప్పగించారు. కంపెనీల వర్గీకరణ, మినహాయింపులు, పాటించాల్సిన నిబంధనల నిర్ధారణ, కార్పొరేట్ సామాజిక బాధ్యతకు సంబంధించిన పరిమితి, ఆడిట్ బాధ్యతలు, జరిమానాల చట్రాలు వంటి కీలక విధానపరమైన అంశాలను తగిన శాసన మార్గదర్శకత్వం లేకుండా అనుబంధ శాసనలకు వదిలివేశారని మనీష్ తివారీ విమర్శించారు.

## ఆర్సెలర్ మిట్టల్ స్టీల్ ప్లాంట్‌తో పరిశ్రమల హబ్‌గా విశాఖ ప్రాంతం: మంత్రి అనగాని



**అమరావతి, పతాకం న్యూస్:** ఆర్సెలర్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ రాకతో విశాఖ ప్రాంతం పరిశ్రమల హబ్‌గా మారుతోందని రాష్ట్ర రెవెన్యూ, స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్ తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విజన్, యువ నేత, మంత్రి నారా లోకేశ్ కష్టానికి ప్రతిఫలం ఈ ఆర్సెలర్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటు అని ఆయన పేర్కొన్నారు. సోమవారం రాజధాని అమరావతిలో మంత్రి అనగాని సత్య ప్రసాద్ విలేకర్లతో మాట్లాడుతూ.. ఈ స్టీల్ ప్లాంట్ ఏర్పాటుతో రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధి చరిత్రలో నేడు ఓ గొప్ప మైలురాయి అని ఆయన అభివర్ణించారు. ఉక్కు రంగంలో రాష్ట్రానికి రూ.1.36 లక్షల కోట్ల పెట్టుబడితో ఈ స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు శంకుస్థాపన జరగనుందని మంత్రి అనగాని వివరించారు. అనకాపల్లి జిల్లా రాజయ్యపేటలో సోమవారం మధ్యాహ్నం కేంద్ర ఉక్కు శాఖ మంత్రి హెచ్‌డీ కుమార స్వామితో కలిసి సీఎం చంద్రబాబు ఈ స్టీల్ ప్లాంట్‌కు శంకుస్థాపన చేయనున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కేంద్ర మంత్రులతోపాటు రాష్ట్ర మంత్రులు, ఉన్నతాధికారులు పాల్గొనున్నారు. ఈ స్టీల్ ప్లాంట్ ద్వారా లక్ష మందికిపైగా ఉపాధి కలగనుంది. ఈ స్టీల్ ప్లాంట్‌కు అనుబంధంగా రూ.11,198 కోట్లతో క్యాప్టివ్ పోర్ట్ ఏర్పాటు చేయనున్నారు. దీంతో మరో 6 వేల ఉద్యోగాలు క్యాప్టివ్ పోర్ట్ ద్వారా రానున్నాయి. ఇక ఈ స్టీల్ ప్లాంట్ ద్వారా లక్ష మందికిపైగా ఉపాధి కలగనుంది.

## ప్రపంచానికి ఏపీ సత్తా చాటిచెప్పే ప్రాజెక్ట్ ఈ స్టీల్‌ప్లాంట్: చంద్రబాబు



**నక్కపల్లి, పతాకం న్యూస్:** అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం రాజయ్యపేటలో విశాఖ ఉక్కు కంటే అతిపెద్ద ప్లాంట్ రాబోతోందని, ఉత్తరాంధ్రలోని నక్కపల్లిలో సరికొత్త చరిత్ర రాయబోతున్నామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. ఆర్సెలార్ స్టీల్‌ప్లాంట్ పెట్టుబడి ఓ గొప్ప మలుపు కాబోతోందని ఆశాభావం వ్యక్తం చేశారు. సోమవారం ఆర్సెలార్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ ఇండియా ప్లాంట్‌కు భూమి పూజ జరిగింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్లాంట్‌కు శంకుస్థాపన చేశారు. అనంతరం బహిరంగ సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. 'ప్రపంచానికి ఏపీ సత్తా చాటిచెప్పే ప్రాజెక్ట్ ఈ స్టీల్‌ప్లాంట్. ప్రధాని మోదీ సహకారంతోనే ప్లాంట్ ఏర్పాటు సాధ్యమైంది. స్టీల్‌ప్లాంట్ ఏర్పాటులో మంత్రి లోకేష్ కృషి ఎంతో ఉంది. అన్నివిధాలా సహకరిస్తున్న పవన్ కల్యాణ్‌కు ధన్యవాదాలు. ప్లాంట్ ఏర్పాటుతో ఉత్తరాంధ్ర రూపురేఖలు మారబోతున్నాయి. ఇది స్టీల్‌ప్లాంట్‌కు శంకుస్థాపన కాదు.. స్టీల్ సిటీకి ఫౌండేషన్. ఏపీలో అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలన అందిస్తున్నాం. కేంద్రం సహకారంతోనే అభివృద్ధి సాధ్యమవుతోంది. ప్లాంట్ ఏర్పాటుతో లక్ష మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వస్తాయి. ప్రాజెక్టుకు భూములు ఇచ్చిన రైతులకు రుణపడి ఉంటాం. అమరావతిని ప్రపంచస్థాయి నగరంగా తీర్చిదిద్దుతాం. క్వాంటమ్ వ్యాలీకి కేరాఫ్‌గా అమరావతి మారబోతోంది. ఉత్తరాంధ్ర సమగ్ర అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం. విశాఖకు గూగుల్ డేటా సెంటర్ రాబోతోంది' అని అన్నారు.

## పశ్చిమాసియాలో పరిస్థితి ఆందోళనకరంగా ఉంది.. లోక్‌సభలో ప్రధాని మోడీ



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** పశ్చిమాసియాలో పరిస్థితి ఆందోళనకరంగా ఉందని ప్రధాని నరేంద్ర మోగఅ చెప్పారు. సోమవారం మధ్యాహ్నం రెండు గంటలకు ఆయన లోక్‌సభలో మధ్యప్రాచ్యంలో యుద్ధం గురించి ప్రసంగించారు. మూడు వారాలుగా యుద్ధం కొనసాగుతోందన్న ప్రధాని మోడీ. భారత్ ఇంధన అవసరాలను పశ్చిమాసియా తీరుస్తోందన్న విషయాన్ని గుర్తు చేశారు. ఈ యుద్ధం భారత్‌కు ఎన్నో సవాళ్లు తీసుకొచ్చిందని మోదీ అన్నారు. ప్రజలపై యుద్ధం తీవ్ర ప్రభావం చూపిస్తోందని కూడా ప్రధాని మోదీ వెల్లడించారు. పశ్చిమాసియాలో కోటి మందికిపైగా భారతీయులు ఉన్నారని, గల్ఫ్‌లో ఉన్న భారతీయుల రక్షణకు చర్యలు చేపట్టామని ప్రధాని మోదీ లోక్ సభలో చెప్పారు. 24 గంటలూ కంట్రోల్ రూమ్స్, హెల్ప్‌లైన్స్ ఏర్పాటు చేశామని, 3.75 లక్షల మంది భారతీయులు క్షేమంగా వెనక్కి వచ్చారని మోదీ తెలిపారు. పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ కొరత లేకుండా చర్యలు చేపట్టామన్నారు. పశ్చిమాసియా పరిస్థితిని నిశితంగా పరిశీలిస్తున్నామని చెప్పారు. ఆయిల్, గ్యాస్, ఎరువుల సరఫరాకు హోర్ముజ్ జలసంధి కీలకమని మోదీ చెప్పారు. ఇంధన భద్రతకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని, దేశంలో 60 శాతం న్రా+ ఉత్పత్తి చేస్తున్నామని, 41 దేశాల నుంచి ఇంధనం కొనుగోలు చేస్తున్నామని మోదీ స్పష్టం చేశారు. దేశంలో 53 లక్షల మెట్రిక్ టన్నుల పెట్రోల్ రిజర్వ్ ఉన్నాయని, హోర్ముజ్ నుంచి మరిన్ని నౌకలు భారత్‌కు వస్తున్నాయని మోదీ వెల్లడించారు. రైల్వేల విద్యుదీకరణతో 180 కోట్ల లీటర్ల డీజిల్ ఆదా అయిందని కూడా మోదీ లోక్ సభలో చెప్పారు. ప్రపంచానికి ఆర్థికమాంద్యం ముప్పు పొంచి ఉందన్న ప్రధాని, భారత్‌పై మాంద్యం ప్రభావం పడకుండా చూస్తున్నామని, ఎలాంటి సంక్షోభాన్నైనా ఎదుర్కొనేందుకు సిద్ధమని మోదీ అన్నారు. ఖరీఫ్‌లో రైతులకు డీజిల్ కొరత లేకుండా చూస్తున్నామని, పవర్ ప్లాంట్స్‌కు కావాల్సినంత బొగ్గు నిల్వలు ఉన్నాయని మోదీ పేర్కొన్నారు. గల్ఫ్ సంక్షోభంపై పార్లమెంట్ మొత్తం ఒకే గళం వినిపించాలని మోదీ ఈ సందర్భంగా కోరారు. చేస్తున్నాయి..

(మొదటిపేజీ తరువాయి)

## భారత్‌కు భారీ ఊరట.. హర్మూజ్ జలసంధిని దాటిన ఎల్‌పీజీ నౌకలు

కొన్న గల్ఫ్ ప్రాంతంలో భారత ఇంధన భద్రతకు ఇది కీలక పరిణామంగా నిపుణులు భావిస్తున్నారు. మరోవైపు, దేశంలో ఇంధన ధరల విషయానికి వస్తే, అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధర బ్యారెల్‌కు 110 డాలర్లు దాటినా, కేంద్ర ప్రభుత్వం సామాన్యులపై భారం పడకుండా పెట్రోల్, డీజిల్ ధరలను స్థిరంగా ఉంచింది. అయితే, వాణిజ్య అవసరాలకు వాడే బల్క్ డీజిల్ ధరను లీటరుకు రూ.22 వరకు, ప్రీమియం పెట్రోల్ ధరను రూ.2 వరకు పెంచింది. ఈ నిర్ణయం రవాణా, తయారీ రంగాలపై ప్రభావం చూపే అవకాశం ఉంది. ప్రస్తుతం దేశంలో 15 నుంచి 20 రోజులకు సరిపడా ఇంధన నిల్వలు ఉన్నాయని, ప్రజలు ఆందోళనతో గ్యాస్ సిలిండర్లను ముందస్తుగా బుక్ చేసుకోవద్దని కేంద్ర పెట్రోలియం శాఖ సూచించింది. అమెరికా వంటి దేశాల నుంచి ఎల్‌పీజీ దిగుమతులను పెంచేందుకు చర్చలు జరుపుతున్నట్లు ప్రభుత్వం తెలిపింది. అయితే, యుద్ధం ఇలాగే కొనసాగితే రానున్న రోజుల్లో సాధారణ ఇంధన ధరలపైనా ప్రభావం పడొచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## ఆపేస్తున్నాం: ట్రంప్

జరిగిన చర్చల నేపథ్యంలో ఇరాన్ విద్యుత్ కేంద్రాలు, ఇంధన మౌలిక సదుపాయాలపై అన్ని రకాల సైనిక దాడులను ఐదు రోజుల పాటు వాయిదా వేయాలని ఆదేశించాను" అని ఆయన సోషల్ మీడియా వేదికగా ప్రకటన చేశారు. పశ్చిమాసియాలో తాము శాంతికోసం కృషి చేస్తామని ట్రంప్ తెలిపారు.

# గొల్లగుంట ముస్లిం స్మశానవాటికలో ప్రహరీ నిర్మాణం



**పరవాడ, పతాకం న్యూస్:** అనకాపల్లి జిల్లా పరవాడ మండలం రావాడ గ్రామ పంచాయతీ పరిధిలోని గొల్లగుంట ముస్లిం స్మశానవాటికలో కొనసాగుతున్న ప్రహరీ గోడ నిర్మాణ పనులను సర్పంచ్ మోటూరు సన్యాసినాయుడు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల నిర్మాణం నాణ్యతతో పాటు నిర్ణీత కాలవ్యవధిలో పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్, అధికారులకు సూచించారు. స్మశానవాటికకు సరైన రక్షణ లేకపోవడంతో అనేక సంవత్సరాలుగా గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తుండగా, ఈ సమస్యను పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఆయన సమస్య పరిష్కారానికి హామీ ఇచ్చారు. స్మశానవాటిక ఉన్న స్థలం గొల్లగుంట గ్రామానికి ఆనుకుని ఉన్న అచ్యుతాపురం మండలం, నునపర్తి పంచాయతీ, నడింపల్లి రెవిన్యూ పరిధిలో సర్వే నెం.2లో ఉండటంతో, యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్‌తో సంప్రదించి ప్రహరీ నిర్మాణానికి చర్యలు చేపట్టారు. ఎమ్మెల్యేల సహకారంతో స్థానిక సర్పంచ్ మోటూరు సన్యాసినాయుడు పంచాయతీ సాధారణ నిధులతో నిర్మాణ పనులు ప్రారంభించారు. రూ.20 లక్షల అంచనా వ్యయంతో ఈ ప్రహరీ గోడ నిర్మాణం చేపట్టినట్లు సర్పంచ్ తెలిపారు. పనులు పూర్తయిన తర్వాత స్మశానవాటికకు రక్షణ కలగడంతో పాటు పరిశుభ్రత మెరుగుపడుతుందని పేర్కొన్నారు. ఈ ప్రహరీ నిర్మాణానికి సహకరించిన పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు, యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజరు కుమార్, నునపర్తి పంచాయతీ సర్పంచ్ సిహెచ్.అనురాధలకు ధన్యవాదాలు తెలిపారు. గ్రామ ప్రజల అవసరాలను గుర్తించి స్పందించిన ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, అధికారులకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యుడు షేక్ ఆలీ, కాంట్రాక్టర్ డి. సంజీవరావు, గ్రామ పెద్దలు జలీల్, ఖాసీం, మాజీ వార్డు సభ్యుడు మౌలాలి, మేస్త్రి షేక్ ఆలీ, జాకీర్ హుస్సేన్, హిమాం హుస్సేన్, బదురుద్దిన్ తదితరులు పాల్గొన్నారు.

# గ్యాస్ కోసం పడిగాపులు



**నర్సీపట్నం, పతాకం న్యూస్:** పశ్చిమ ఆసియాలో యుద్ధ ప్రభావం వంట గ్యాస్‌పై తీవ్ర ప్రభావం చూపుతోంది. వినియోగదారులు గ్యాస్ బుక్ చేసి 15 రోజులు దాటినా సరఫరా కావడం లేదు. మునిసిపాలిటీలో 2,001 మందికి, గ్రామీణ ప్రాంతాల్లో 1,800 మందికి బుక్ చేసుకున్న గ్యాస్ సిలిండర్లు సరఫరా చేయాల్సి ఉంది. ఇండేన్ గ్యాస్ ఏజెన్సీకి సంబంధించిన 2,584 మంది వినియోగదారులు వంట గ్యాస్ ఎప్పుడు సరఫరా చేస్తారా? అని ఎదురు చూస్తున్నారు. ఉన్నతాధికారులు వంట గ్యాస్ కొరత లేదంటున్నారు. క్షేత్ర స్థాయిలో చూస్తే వినియోగదారులు వంట గ్యాస్ కోసం పడిగాపులు కాస్తున్నారు. రెండు రోజుల క్రితం వరకు హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీకి 504, అలాగే 342 సిలిండర్లు చొప్పున రెండు లోడ్లు పంపేవారు. ఇప్పుడు 504 సిలిండర్లుతో ఒక లోడు మాత్రమే పంపుతున్నారు. చమురు కంపెనీలు డొమెస్టిక్ సిలిండర్లు సరఫరా కూడా తగ్గించారు. జనవరి, ఫిబ్రవరి నెలల్లో విడిపించిన సిలిండర్లు సరాసరి చేసి పొదుపుగా వంట గ్యాస్ పంపుతున్నారు. అవసరం లేకపోయినా వినియోగదారులు బుక్ చేస్తున్నారని ఏజెన్సీ నిర్వాహకులు చెబుతున్నారు. అయితే కృత్రిమ కొరత సృష్టించి బ్లాక్‌లో అమ్ముకుంటున్నారని వినియోగదారులు విమర్శిస్తున్నారు. 6, 7 తేదీల్లో బుక్ చేసుకున్న వారికి శనివారం హెచ్‌పీ గ్యాస్ డెలివరీ చేస్తున్నారు.

# నర్సీపట్నం మున్సిపాల్టీ అప్‌గ్రేడ్‌ను అడ్డుకున్న వైసీపీ: విజయ్



**నర్సీపట్నం, పతాకం న్యూస్:** నర్సీపట్నం మునిసిపాలిటీని ప్రథమ శ్రేణిగా అప్‌గ్రేడ్ చేయకుండా వైసీపీ నాయకులు ఉద్దేశ పూర్వంగా అడ్డుకుంటున్నారని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ ఆరోపించారు. ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ, ఈ నెల 17 జరిగిన మునిసిపల్ కౌన్సిల్ పాలకవర్గం చివరి సమావేశంలో గ్రేడ్-3లో వున్న మునిసిపాలిటీని గ్రేడ్-1కి అప్‌గ్రేడ్ చేయాలని అజెండాలో నాలుగో అంశంగా పెట్టారని తెలిపారు. అయితే ఈ అంశాన్ని ఆమోదించడం లేదంటూ చైర్‌పర్సన్ సుబ్బలక్ష్మి ఉద్దేశపూర్వంగా సంతకం చేశారని విమర్శించారు. మాజీ ఎమ్మెల్యే పెట్ల గణేశ్, వైసీపీ నాయకులు కలిసి రాజకీయ కక్షతో మునిసిపాలిటీ అప్‌గ్రేడ్‌ను అడ్డుకుంటూ, కుట్ర పూరితంగా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. నిబంధనల ప్రకారం పురపాలక సంఘం వార్షిక ఆదాయం రూ.4 కోట్లు దాటితే మొదటి శ్రేణి మునిసిపాలిటీగా పరిగణిస్తారని, కానీ నర్సీపట్నం మునిసిపాలిటీ వార్షిక ఆదాయం రూ.15 కోట్లు దాటిందని వివరించారు. మునిసిపాలిటీ గ్రేడ్ పెరిగితే కేంద్ర ప్రభుత్వం ఎక్కువ నిధులు రావడంతోపాటు, భూగర్భ డ్రైనేజీ వ్యవస్థకు ప్రపంచ బ్యాంక్ నిధులు మంజూరు చేస్తుందని విజయ్ తెలిపారు.

# ఇంటి వైపు దూసుకొచ్చిన కారు ఢీకొనడంతో బాలుడు మృతి



**గూడెంకొత్తవీధి, పతాకం న్యూస్:** చింతపల్లి- కృష్ణాదేవిపేట జాతీయ రహదారి రింతాడ గ్రామం వద్ద ఒక కారు అదుపుతప్పి వేగంగా ఇంటి వైపు దూసుకొచ్చింది. అరుగుపై ఆడుకుంటున్న మూడేళ్ల బాలుడిని కారు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. దీనికి సంబంధించి పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. పెదవలసకు చెందిన ఏపీఈపీడీసీఎల్ ఉద్యోగి ప్రసాద్ బంధువుల వివాహం విందుకు హాజరై స్వగ్రామానికి వస్తున్నాడు. నిద్రమత్తు వల్ల రెప్పపాటు వ్యవధిలో కారు అదుపుతప్పి రహదారిపై నుంచి దిగువనున్న ఇంటి వైపు దూసుకొచ్చింది. ఆ ఇంటి అరుగుపై ఆడుకుంటున్న వంతల లోకేశ్(3)ను ఢీకొనడంతో ఆ బాలుడు తీవ్రంగా గాయపడ్డాడు. తల్లిదండ్రులు వెంటనే ఆ బాలుడిని చింతపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే బాలుడి ఆరోగ్య పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని జీకేవీధి ఎస్ఐ సురేశ్‌కుమార్ తెలిపారు.

# క్రాంతినగర్ గ్రామంలో ఉచిత పశు వైద్య శిబిరం



**మల్కాపురం, పతాకం న్యూస్ :** గాంధీగ్రామ పశువైద్య శాల పరిధిలో క్రాంతి నగర్ గ్రామంలో ఉచిత పశువైద్య శిబిరం వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్వర్యంలో నిర్వహించారు. ఈ శిబిరాన్ని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అపర్ణ పారంభించారు. ప్రతి గ్రామంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ ఈ విధంగా గ్రామాల్లో ఉచిత పశు వైద్య శిబిరాలు నిర్వహిస్తుందనని ఈ రోజు క్రాంతి నగర్ గ్రామంలో పాడి రైతులకు ఉపయోగ పడుతుందని పశు వైద్య శిబిరం నిరహిస్తున్నామని ఈ అవకాశం రైతులు వినియోగించు కోవాలి అని తెలిపారు .ఈ క్యాంపుకీ 15000విలువ చెసే మెడిసిన్ అందచేశారు.ఈ శిబిరంలో యలమంచిలి శివప్రకాష్, మార్కెట్ యార్డు కార్యదర్శి డి రవికుమార్, సభ్యులు సుభాని, రమా బాయి, పశు సంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎం చంద్రశేఖర్, జిల్లా పశు అభివృద్ధి సంస్థ డిప్యూటీ డైరెక్టర్ సజ్జ శ్రీనివాసరావు, జిల్లా పిడిపి డిప్యూటీ డైరెక్టర్ ఎ రవికుమార్, హాజరయ్యారు. ఈ శిబిరం లో స్థానిక పశు వైద్య డాక్టర్ సునీల్ కుమార్ మాట్లాడుతూ పశు సమస్యలును అధికారులు వివరించి. ఈ శిబిరంలో పశువులకు గార్భకోసా వ్యాధికి సంబంధించి చికిత్సలు చేసారు.

# యథేచ్ఛగా రోడ్డుకు ఇరువైపులా దుకాణాలు



**కొయ్యూరు, పతాకం న్యూస్:** మండల కేంద్రంలోని హనుమాన్ జంక్షన్ నుంచి పాత బస్టాండ్ వరకు రహదారికి ఇరువైపులా యథేచ్ఛగా దుకాణాలు ఏర్పాటు చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. రోడ్డుకు ఇరువైపులా దుకాణాలు ఏర్పాటు చేయవద్దంటూ ఫ్లెక్సీ ఏర్పాటు చేసి చేతులు దులిపేసుకుంటున్నారు. మండల కేంద్రంలో మాంసాహారం, చేపల దుకాణాలు గతంలో కేవలం సంతబయలులో మాత్రమే ఉండేవి. కొంత కాలంగా అధికారులు చూసీచూడనట్టుగా వ్యవహరించడం వల్ల ఈ దుకాణాలన్నీ రహదారికి ఇరువైపులా చేరాయి. ప్రస్తుతం హనుమాన్ జంక్షన్ నుంచి పాత బస్టాండ్ వరకు విచ్చలవిడిగా ఏర్పాటు చేసి వ్యాపారాలు సాగిస్తున్నారు. దీంతో దుర్గంధంతో పాటు ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. కుక్కల బెడద పెరిగిపోయింది. ఆరు నెలల క్రితం ఓ గ్రామ సచివాలయం ఉద్యోగి నడిచి వెళుతుండగా మాంసాహార దుకాణాల వద్ద సంచరిస్తున్న శునకాలు కరవడంతో ఆమె ర్యాబిస్ వ్యాధికి గురై మృతి చెందింది. అధికారులు ఆరు వారాల క్రితం రహదారికి ఇరువైపులా ఏర్పాటుచేసిన మాంసాహార దుకాణాలను సంతబయలు తరలించారు. అయితే మండల పరిషత్, పంచాయతీ అధికారులు పట్టించుకోకపోవడంతో గత వారం నుంచి యథావిధిగా రోడ్డుకు ఇరువైపులా దుకాణాలను ఏర్పాటు చేసుకుని విక్రయాలు సాగిస్తున్నారు. ఇప్పటికైనా కలెక్టర్, జిల్లా పంచాయతీ అధికారి స్పందించి చర్యలు తీసుకోవాలని గిరిజన సంఘం నాయకులు, ఈ ప్రాంతవాసులు కోరుతున్నారు.

# ఏపీ, తెలంగాణ కోర్టులకు బాంబు బెదిరింపుల్ణు

**అమరావతి, హైదరాబాద్, పతాకం న్యూస్:** ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని రెండు కీలకమైన కోర్టులకు సోమవారం బాంబు బెదిరింపులు రావడం తీవ్ర కలకలం సృష్టించింది. మచిలీపట్నం (బందర్), తెలంగాణలోని ములుగు జిల్లా కోర్టులను లక్ష్యంగా చేసుకుని అజ్ఞాత వ్యక్తులు పంపిన ఈమెయిల్స్ న్యాయమూర్తులు, న్యాయవాదులు, కక్షిదారులను భయాందోళనకు గురిచేశాయి. ఒకే తరహాలో ఈమెయిల్స్ రావడం వెనుక ఏదైనా కుట్ర ఉందా అనే కోణంలో తెలంగాణ, ఏపీ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కృష్ణా జిల్లా కేంద్రమైన మచిలీపట్నం జిల్లా కోర్టుకు బాంబు బెదిరింపు రావడం సంచలనం సృష్టించింది. జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తికి అజ్ఞాత వ్యక్తి నుంచి బాంబు ఉందనే మెయిల్ రావడంతో ఒక్కసారిగా అంతా అప్రమత్తమయ్యారు. ప్రాణహాని ఉంటుందనే భయంతో న్యాయమూర్తులందరూ తమ గదులను వదిలి బయటకు వచ్చారు. వీరంతా కోర్టు ఆవరణలోని ఆరుబయట కుర్చీల్లో కూర్చుని పరిస్థితిని గమనించారు.సమాచారం అందిన వెంటనే పోలీసులు, క్లూస్ టీమ్ కోర్టు ప్రాంగణాన్ని తమ ఆధీనంలోకి తీసుకున్నాయి. ప్రస్తుతం క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహిస్తున్నాయి.తెలంగాణలోని ములుగు జిల్లా కోర్టుకు కూడా అదే తరహాలో బాంబు బెదిరింపులు వచ్చాయి. కోర్టులో బాంబు పెట్టినట్లు ఈమెయిల్ రావడంతో సిబ్బంది, లాయర్లు ప్రాణభయంతో బయటకు పరుగులు తీశారు. దీంతో కోర్టు కార్యకలాపాలు నిలిచిపోయాయి. ములుగు పోలీసులు, బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌తో కోర్టు హాల్స్, రికార్డు రూమ్‌లను అణువణువు తనిఖీ చేస్తున్నాయి.

# దేవరాపల్లిలో జీడీ రైతుల భారీ ఆందోళన



- ఉరి తాళ్లతో జీడీ రైతుల ఆందోళన
- మంచు తెగులు, అకాల వర్షాలకు పంట నష్ట పోయిన జీడీ రైతులకు పరిహారం చెల్లించాలి

**దేవరాపల్లి, పతాకం న్యూస్:** మంచు తెగులు అకాల వర్షాలకు నష్ట పోయిన జీడీ రైతులను ప్రభుత్వ ఆదుకోక పోతే ఉరి తాళ్ళే శరన్యమని దేవరాపల్లి మండలం వాలాబు పంచాయతీ లో గిరిజన రైతులు అర్ధ నగ్నంగా ఉరితాళ్ళు మెడకు వేసు కుని పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు వీరికి మద్దతుగా వ్యవసాయ కార్మికసంఘం జిల్లా ప్రదాన కార్యదర్శి డి వెంకన్న గిరిజన సంఘం జిల్లా ఉపాద్యాక్షులు బిటి దొర పల్గోని మాట్లాడారు,ఈసం వత్సరం అకాల వర్షాలు వల్ల,మంచు తెగులుతో జీడీతోటలు పూర్తిగా నాశనమయ్యాయని తెలిపారు సంవత్సరం కాలం జీడి పైనె అదార పడ్డ గిరిజన రైతులు అప్పులు పాలు అయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు ఎకారకు 30 వేలు చప్పున నష్టం పరిహారం చేల్లించాలని డిమాండ్ చేసారు,రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నక్కపల్లి పర్యటన సందర్భంగా జీడీ పంటలకు నష్ట పరిహారం పై స్పష్టమైన ప్రకటన చేయాలని కోరారు జిల్లాలోని వరి తరువాత మెట్ట భూముల్లో ప్రదాన పంట జీడీ పంటగా ఉందని తెలిపారు అటువంటి పంటలను కూటమి ప్రభుత్వ గుర్తించక పోవడం దారుణ మన్నారు కోద్దిగోప్పో ఉన్న జీడీ పిక్కలకు మద్దతు ధర కేజీ 200 రూ/-ప్రకటించి ఆర్.ఎస్.కె ల ద్వారా కోను గోలు చేయాల అన్నారు గత 5 సంవత్సరం నుండి వాతావరణ మార్పులు ఉష్ణో గ్రతలు పొగ మంచు,తెగుళ్లు పిండి నల్లి.వంటి తదితరవిపత్తులు వల్ల పూత, పింజ దెబ్బతిని తీవ్ర నష్టాలకు గురయ్యారని పేర్కొన్నారు ఈసంవత్సరం కూడా పూత వచ్చినా కాపు నిలపడక పూర్తిగా అనేక మంది తోటలు దెబ్బతి న్నాయని.తోటలకు గొప్పులు దుక్కులు మందులు కొట్టటానికి ఎకరకు 40,000 రూ పెట్టు బడిపెట్టి నా కాపునిలబడక నష్ట పోయారని తెలిపారు. జిల్లాలో 2024-25 సంవత్సరా నికి జీడి పంటల భీమాకు రైతులు వాటవేలాది మందిలక్షలాది రూ/-భీమా కంపెనీలకు చెల్లించినా పంటనష్టాలు జరిగిన ఇంతవరకు పంటల భీమా చెల్లించలేదని భీమా కంపెనీలు రాష్ట్ర ప్రభుత్వ వాటా చెల్లించ పోవటంతో రైతులకు చెల్లించ లేదన్నారు అందువల్ల ఈసంవత్సరం రాష్ట్ర ప్రభుత్వంతో వాతావరణ బీమాకంపెనీలు ఎగ్రిమెంట్ చేయలేదన్నారు భీమా ప్రీమియం మొత్తం రైతులు చెల్లించిన వారికే భీమాకంపెనీలు చేసుకు న్నవని తెలిపారు,పంటల భీమా వల్ల ప్రభుత్వం నుంచి రైతుల నుంచి భీమా ప్రీమియం చెల్లించిన డబ్బులుతో భీమా కంపెనీలు లాభ పడుతున్నవి తప్ప రైతులను ఆదు కోలేదన్నారు ఈ పరిస్థితిలో రైతులు ప్రతి సంవత్సరం నష్టాలు భరించలేక అనేక మంది జీడీ తోటలను పూర్తిగా తొలగించుకునె పరిస్థితి ఎర్పడుతుందని తెలిపారు జీడి పంటలు ఎస్సీ,ఎస్టి,చిన్న,సన్న కారు రైతులు ఎక్కువగా పండి స్తున్నారని తెలిపారు కనీసం కేజీ 200/-రూ ,,ఇస్తి తప్ప కిట్టుబాటు కదన్నారు అందువల్ల ప్రభుత్వం ఆర్ .ఎస్ .కెల ద్వారా కేజీ 200రూ /కొనుగోలు చేయాలి. పంటల భీమా ప్రభుత్వమే ఉచితంగా అమలు చేయాలని డిమాండ్ చేసారు ఆర్టికల్చర్ అదికారులు ఆపీసుల్లో నిద్ర పోకుండా గ్రామాల్లో తిరిగి జీడీ పంటలను అంచనా కట్టి వెంటనే నష్టపరిహారం చేల్లించాలని కేజీ జీడీ రెండు వందలు రూపాయలు ఇచ్చి ప్రభుత్వ మే కోనుగోలు చేయాలని చంద్రబాబు నాయుడు నక్కపల్లి వచ్చిన సందర్భంగా జీడీ పంటలకు పరిహారం ప్రకటన చేయాలని వారు డిమాండ్ చేసారు,లెదంటే ఉరితాళ్ళె శరన్యమని స్పష్టం చేశారు ఈకార్యక్రమంలో ,సిహెచ్ లక్ష్మణ కాశి ఈశ్వరావు కె సుదకార్ సిహెచ్ చిన దేముడు బి నాగేశ్వరావు ఇ గోపాలుడు కె రాము బి దేముడు ఎర్రయ్య డి సోమయ్య జి దేముడు మామిడి దేముడు ఎరకయ్య పి శ్రీరాం పి,మహలక్ష్మీ నాయుడు యస్ క్రిష్ణా తో పాటు అదిక సంఖ్యలో గిరిజన జీడీ రైతులు పాల్గొన్నారు.

# విద్యార్థి ప్రగతికి విశ్వవిద్యాలయమే కేంద్రం



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** విద్యార్థి ప్రగతికి విశ్వవిద్యాలయమే కేంద్రంగా నిలుస్తుందని ఐఐటి ఢిల్లీ పూర్వ సంచాలకులు ఆచార్య వివిఎస్.రాజు చెప్పారు. ఎయు వైవిఎస్ మూర్తి ఆడిటోరియంలో ఆంధ్రవిశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాలలో భాగంగా జియోటెక్నికల్ సొల్యూషన్స్ ఫర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్ట్స్ ఇన్ ప్రోబ్లమేటిక్ గ్రౌండ్ అంశంపై నిర్వహించే రెండు రోజుల వర్క్‌షాప్‌ను ఆయన ప్రారంభించారు. ఎయు సివిల్ ఇంజినీరింగ్ విభాగం, ఇండియన్ జియో టెక్నికల్ సొసైటీ(ఐజిఎస్) విశాఖ ప్రాంతీయ కేంద్రం సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాయి. ఈ సందర్భంగా వివిఎస్.రాజు మాట్లాడుతూ, ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాలలో తాను పనిచేసిన ప్రాంతాలో గమనించి నేల స్వభావం, నిర్మాణాలు, తీసుకున్న నిర్ణయాలు, కీలక పరిణామాలను వివరించారు. ఆంధ్రవిశ్వవిద్యాలయంలో తాను చదువుకొని పొందిన జ్ఞానం తనను నేడు ఈ స్థానంలో నిలిపిందన్నారు. ఎయు విసి ఆచార్య జిపి.రాజశేఖర్ మాట్లాడుతూ పట్టణీకరణ నేపథ్యంలో నిర్మాణ రంగంలో అనేక సాంకేతిక మార్పులు చోటు చేసుకుంటున్నాయని తెలిపారు. వర్తమాన సాంకేతికత అంశాలను కరికులంలో భాగం చేస్తామన్నారు. ప్రత్యేకమైన కోర్సులను ఆన్‌లైన్ విధానం, ఎపిటిఇఎల్‌లో అందించాలన్నారు. నేలను సంరక్షించుకోవడం ఎంతో అవసరమన్నారు. సివిల్ ఇంజినీరింగ్ విభాగం అధిపతి, ఐజిఎస్ విశాఖపట్నం చాప్టర్ చైర్మన్, సదస్సు కన్వీనర్ ఆచార్య సిఎన్‌వి.సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ, ప్రత్యేక స్వభావం, లక్షణాలు కలిగిన నేలల్లో నిర్మాణాలపై నిపుణులు విలువైన సూచనలు అందించే వేదికగా ఈ వర్క్‌షాప్ నిలుస్తుందన్నారు. ఈ సదస్సు కోసం 260 మంది ప్రతినిధులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని తెలిపారు. మెత్తటి బంకమట్టి నేలలు, ద్రవీకరణకు గురయ్యే నేలలు, విస్తరణ స్వభావం గల నేలల వంటి సమస్యాత్మక నేలల గురించి అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందని, నేల స్వభావానికి అనుగుణంగా తగిన గ్రౌండ్ ఇంప్రూవ్‌మెంట్ పద్ధతులను లేదా పునాదుల నమూనాలను రూపొందించాలని చెప్పారు. సదస్సు సమన్వయకర్త ఆచార్య పివివి.సత్యనారాయణ మాట్లాడుతూ, దేశ బడ్జెట్‌లో రూ.12 లక్షల కోట్లు మౌలిక సదుపాయాల అభివృద్ధికి కేటాయించాయన్నారు. ప్రాధాన్యత కలిగిన అంశంపై నిపుణులతో ప్రత్యక్షంగా జ్ఞానాన్ని పంచే వేదికగా సదస్సును తీర్చిదిద్దామన్నారు.

## అకాల వర్షాలతో నేలకొరిగిన మొక్కజొన్న పంట



**మన్యం జిల్లా, పతాకం న్యూస్:** అకాల వర్షాలతో మొక్కజొన్న పంట నేల మట్టమయ్యింది. పంట చేతికొచ్చే సమయంలో కోలుకోలేని దెబ్బతగిలిందని, నష్టపరిహారం కోసం రైతులు ఎదురుచూపులు చూస్తున్నారు. అకాల వర్షాలతో మొక్కజొన్న పంట నేలకొరిగింది. గత రెండు రోజులుగా బలిజిపేట మండలంలో బలమైన ఈదురు గాలులు భారీ వర్షాలు పడటంతో మొక్కజొన్నకు తీవ్ర నష్టం వాటిల్లిందని రైతు సంఘం జిల్లా నాయకులు గేదెల సత్యనారాయణ అన్నారు. ఈ సందర్భంగా గౌరీ పరమ గ్రామంలో నేలకొరిగిన జన్న పంటను పరిశీలించారు. గత రెండు రోజులుగా కురిసిన వర్షాలకు మండలంలో 70 నుండి 80 ఎకరం మొక్కజొన్న పంటకు నష్టం వాటిల్లినట్లు తెలిపారు. జిల్లాలో సుమారుగా 1000 ఎకరాలు జన్న పంట నష్టం జరిగిందని, బలిజిపేట మండలంలో 5000 ఎకరాలు జన్న పంట నాటినట్లు సుమారుగా 70 నుండి 80 ఎకరాలు జన్న పంట నేలకు ఒరిగినట్లు తెలిపారు. ఎకరాకు 30000 ఖర్చు అవుతుందని ఈ పంట నేలకొరిగిన కారణంగా రైతు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని, అందువలన ప్రభుత్వము మద్దతు ధర 2400 రూపాయలు అయినప్పటికీ దళారులు 16 నుండి 1800 రూపాయలకు కొనుగోలు చేస్తున్నారని ఆయన తెలిపారు. ప్రభుత్వమే జొన్న పంటను మద్దతు ధరకు కొనేటట్లు చేయాలని, అకాల వర్షముల కారణంగా జరిగిన పంట నష్టాన్ని అంచనా వేసి రైతులకు నష్టపరహారము చెల్లించినట్లు వ్యవసాయ అధికారులు చేయాలనే తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్షులు మండల గోవింద మరియు మండల త్రినాధ రెడ్డి రాంబాబు ఖండాపు సింహాద్రి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## శిథిలావస్థకు చేరిన పట్టించుకోరా?



**పాతపట్నం, పతాకం న్యూస్:** మండంలోని సింగుపురం పం చాయతీపరిధిలోని బళ్లఖానా దీర్ఘకాలంగా మరమ్మతులకు నోచుకోకపో వడంతో శిథిలావస్థకు చేరింది. ఇప్పటికే ఈ ఖానాకు ఇరువైపులా ఉండే రక్షణ గోడలు బీటలు వారాయి. ఖానా, రోడ్డుకు మధ్య గోతులు ఏర్పడడం తో ఏమరపాటుగా వెళ్లే సమయంలో వాహనచోదకులు తరచూ ప్రమా దాలకు గురవుతున్నారు. బళ్లఖానా గుండా పొగడవిల్లిగెడ్డ నుంచి వచ్చే నీటిని సింగుపురం పంచాయతీపరిధిలోని గ్రామాలతోపాటు ధనుపురం వరకూ దిగువప్రాంతాలకు సాగునీరువెళ్తోంది. ఈఖానా మీదుగా దేవుద ళ, కొంచాడపేట, చిన్నమల్లిపురం తదితర గ్రామాలతో పాటు హిరమం డలం, సారవకోట మండలాల్లోని పలు గ్రామాలకు మార్గం కావడంతో నిత్యం రద్దీగా ఉంటోంది. ఏక్షణంలోనైనా ఖానా కూలిపోతే రాకపోకలకు నిలిచిపోయే ప్రమాదముందని పలు గ్రామాల ప్రజలు ఆందోళన చెందు తున్నారు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి ఖానాకు మరమ్మతులు చేయాలని పలువురు కోరుతున్నారు.

## నేరాల నియంత్రణకు కృషి



**విజయనగరం, పతాకం న్యూస్:** : జిల్లాలో నేరాల నియంత్రణకు కృషి చేస్తున్నామని ఎస్పీ ఏఆర్ దామోదర్ తెలిపారు. ఆయన కొత్తవలస, ఎస్.కోట పోలీసుస్టేషన్లను సందర్శించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ.. నూటికి నూరుశాతం నేరాలను నియంత్రించలేమని.. సమాజంలో నేరాలు జరుగుతూ ఉంటాయని, వాటి నియంత్రణకు పోలీసు శాఖ ప్రయత్నం చేస్తుంటుందని తెలిపారు. కొత్తవలస విశాఖపట్టణానికి దగ్గరలో ఉండడమే కాకుండా రైల్వేస్టేషన్ కూడా విశాఖ-అరకు రోడ్డుకు ఆనుకుని ఉండడం వల్ల నేరాలు జరిగే అవకాశాలు ఉన్నాయన్నారు. అలాగే ఇక్కడ ట్రాఫిక్ నియంత్రణ కోసం కొత్తవలస సీఐ ఎక్కడికక్కడ స్టాపర్లను ఏర్పాటు చేశారన్నారు. మండలంలోని కంటకాపల్లి రైల్వేస్టేషన్ సమీపంలోని బొగ్గు యార్డు నుంచి భారీ వాహనాలలో బొగ్గు రవాణా జరుగుతోందని, ఈ రవాణాను ఆపలేమని, బొగ్గు రోడ్డు మీద పడకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. శనివారం రాత్రే సైబర్ నేరాలకు సంబంధించి ఇద్దరు నిందితులను అరెస్టు చేశామన్నారు. జిల్లాలో గంజాయి రవాణా నియంత్రణే లక్ష్యంగా వేర్వేరు ప్రాంతాల్లో వాహన తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. గంజాయి కేసుల్లో అరెస్టయిన నిందితులపై హిస్టరీ షీట్లు తెరవడంతోపాటు గంజాయి వ్యాపారంలో సంపాదించిన ఆస్తులను జప్తు చేస్తున్నామని చెప్పారు. దీంతోపాటు ఎస్.కోట స్టేషన్‌లో సీజ్ చేసి ఉంచిన వాహనాలను పరిశీలించి, చట్టప్రకారం వాటిని డిస్పోజ్ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో విజయనగరం డీఎస్పీ ఆర్.గోవిందరావు, సీఐలు షణ్ముఖరావు, నారాయణమూర్తి, ఎస్ఐలు చంద్రశేఖర్, సత్యనారాయణ పాల్గొన్నారు.

# శ్రీకాకుళం జిల్లాలో ఒక కుటుంబంపై సామాజిక బహిష్కరణ



**శ్రీకాకుళం, పతాకం న్యూస్:** శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండలం కొండములగాం గ్రామంలో ఒక కుటుంబాన్ని సామాజికంగా బహిష్కరించడం ఇప్పుడు జిల్లా వ్యాప్తంగా పెను సంచలనం సృష్టిస్తోంది. నాగరిక సమాజంలో ఇంకా ఇలాంటి వెలివేతలు కొనసాగడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. భూ వివాదం నేపథ్యంలో ఒక కుటుంబాన్ని గ్రామం నుంచి వెలివేస్తున్నట్లు గ్రామ పెద్దలు, గ్రామస్తులు కలిసి ఏకగ్రీవంగా తీర్మానం చేయడం కలకలం రేపింది. సదరు కుటుంబం తమ భూమికి సంబంధించిన రికార్డులను రెవెన్యూ శాఖలో తారుమారు చేసిందని, ఈ విషయంలో గ్రామ పెద్దలు పలుమార్లు హెచ్చరించినప్పటికీ వారు పెడచెవిన పెట్టడంతోనే ఈ కఠిన నిర్ణయం తీసుకున్నట్లు గ్రామస్తులు చెబుతున్నారు. ఈ మేరకు గ్రామంలో దండోరా వేయించి, ఆ కుటుంబ సభ్యులను ఎటువంటి పనులకు పిలవకూడదని, శుభకార్యాలకు ఆహ్వానించవద్దని ఆంక్షలు విధించారు.

ఈ ఘటనపై సమాచారం అందుకున్న పోలీస్, రెవెన్యూ అధికారులు తక్షణమే స్పందించారు. సామాజిక బహిష్కరణ అనేది చట్టరీత్యా నేరమని, ఇలాంటి చర్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ఉండేందుకు త్వరలోనే అవగాహన సదస్సు ఏర్పాటు చేస్తామని అధికారులు వెల్లడించారు. భూ వివాదాలు ఉంటే చట్టపరంగా పరిష్కరించుకోవాలి తప్ప, ఇలా అమానవీయంగా వెలివేతలకు పాల్పడటం రాజ్యాంగ విరుద్ధమని అధికారులు స్పష్టం చేశారు. ప్రస్తుతం బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు ఈ వ్యవహారంపై విచారణ జరుపుతున్నారు.

## కోర్టుల్లో మౌలిక వసతులకు ప్రాధాన్యత



**ఎస్.కోట, పతాకం న్యూస్:** రాష్ట్రంలో కోర్టుల నిర్మాణం, మౌలిక వసతుల కల్పనకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు హైకోర్టు న్యాయమూర్తి చీకటి మానవేంద్రనాథ్ రారు స్పష్టంచేశారు. శృంగవరపుకోటలో రూ.8.5 కోట్ల సిపిడబ్ల్యు నిధులతో నిర్మించనున్న జూనియర్ సివిల్ జడ్జి కోర్టు భవనానికి హైకోర్టు న్యాయమూర్తులు తర్లాడ రాజశేఖరరావు, మానవేంద్రనాథ్ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.బబిత, కలెక్టర్ రామసుందర రెడ్డి, విజయనగరం ఎస్పి ఎ.ఆర్.దామోదర్, పార్వతీపురం ఎస్పి మాధవరెడ్డి పాల్గొన్నారు. అనంతరం వెంకటేశ్వర ఫంక్షన్ హాల్‌లో జరిగిన సభలో మానవేంద్రనాథ్ రారు మాట్లాడుతూ ఐదేళ్లకు పైబడి పెండింగ్‌లో ఉన్న కేసులను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలని న్యాయమూర్తులకు సూచించామన్నారు. 20 ఏళ్లకు పైబడిన కేసుల పరిష్కారానికి న్యాయవాదులు పూర్తి సహకారం అందించాలని కోరారు. లోక్ అదాలత్ ద్వారా రాష్ట్రంలో ఇప్పటికే 3 లక్షలకు పైగా కేసులు పరిష్కారం అయ్యాయని, సివిల్ కేసుల పరిష్కారంలో గుంటూరు జిల్లా ముందంజలో ఉందని వివరించారు. జిల్లా అడ్మినిస్ట్రేషన్ జడ్జి తర్లాడ రాజశేఖర రావు మాట్లాడుతూ విజయనగరం, బొబ్బిలి, చీపురుపల్లి కోర్టు భవనాల పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. ఎస్.కోట కోర్టు భవనాన్ని 15 నెలల్లో పూర్తి చేస్తామని తెలిపారు. అనంతరం న్యాయవాద సంఘాల ఆధ్వర్యంలో హైకోర్టు న్యాయమూర్తులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయి కళ్యాణ చక్రవర్తి, స్థానిక న్యాయమూర్తి బి. కనకలక్ష్మి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు జి.సూరిదేముడు, సీనియర్ న్యాయవాది ఎం.దుర్గాప్రసాద్, డబ్ల్యు.ఎన్.శర్మ, తదితరులు పాల్గొన్నారు.

## మూలకుచేరిన తడి, పొడి సేకరణ వాహనాలు




**పలాస, పతాకం న్యూస్:** పలాస- కాశీ బుగ్గ మునిసిపల్ కార్యాలయంలో ఆవరణలో తడి పొడి చెత్త వాహనాలతో పాటు మంచినీటి ట్యాంకర్లు నిర్వహణ లేకపోవడంతో నిరుపయోగంగా మారాయి. దీంతో లక్షలాది రూపాయల ప్రజాధనంతో కొనుగోలు చేసిన వాహనాలు దిష్టిబొమ్మల్లా మారాయి. మునిసి పాలిటీ పరిధిలో తడి,పొడి చెత్త సేకరణకోసం కొనుగోలు చేసిన ఏడు వాహనాలు నెలల తరబడి వినియెగంలో లేవు. ఇవి మునిసిపల్ కార్యాలయం ఆవరణలో నిరుపయోగంగా ఉండడంతో టైర్లతో పాటు వాహనాల్లో పార్టులు పాడవు తున్నాయి. అలాగే జంటపట్టణాల్లో నీటిఎద్దడి దృష్టిలో పెట్టుకొని లక్షలాది రూపాయలతో నీటి ట్యాంకర్లు కొనుగోలు చేశారు. వాటి వినియోగంపై కూడా మునిసిపల్ అధి కారుల పర్యవేక్షణ లేకపోవడంతో నీటి ట్యాంకులు పాడవుతున్నాయి. ఆ వాహనాలు తుప్పప డుతుండ గా టైర్లు పంచర్ల వుతున్నాయి. మార్చి నెలలోనే నీటి ఎద్దడి నెలకొంది. ఈ వాహనాలు వినియోగంలోకి తీసుకొచ్చి ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని పలువురు కోరుతున్నారు.

## ఏపీపై నమ్మకం ఉంచినందుకు ధన్యవాదాలు.. ఆర్సెలర్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ శంకుస్థాపనలో పవన్



**నక్కపల్లి, పతాకం న్యూస్:** ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక ప్రగతిలో మరో కీలక ముందడుగు పడింది. రాష్ట్రంలో ఆర్సెలర్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ఇండియా సంస్థ ఏర్పాటు చేయనున్న భారీ ఉక్కు పరిశ్రమకు శంకుస్థాపన జరిగింది. అనకాపల్లి జిల్లా నక్కపల్లి వద్ద రాజయ్యపేటలో జరిగిన ఈ కార్యక్రమానికి హాజరైన ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, రాష్ట్రానికి భారీ పెట్టుబడులు రావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. రూ.1.35 లక్షల కోట్ల పెట్టుబడితో, లక్ష మందికి ఉపాధి కల్పించే ఈ ప్రాజెక్టును మనస్ఫూర్తిగా స్వాగతిస్తున్నామని ఆయన తెలిపారు. ఈ ప్రాజెక్టు ద్వారా ముఖ్యంగా ఉత్తరాంధ్ర ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ, "ఆర్సెలర్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ఇండియా సంయుక్త భాగస్వామ్యంతో దేశంలోనే అతిపెద్ద గ్రీన్‌ఫీల్డ్ ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్‌ను మన రాష్ట్రంలో ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉంది. దీని ద్వారా ఏటా 17.8 మిలియన్ మెట్రిక్ టన్నుల ఉక్కు ఉత్పత్తి అవుతుంది. ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్ష మందికి ఉపాధి లభించడం అనేది ఈ ప్రాంత యువతకు గొప్ప వరం. ఆంధ్రప్రదేశ్‌పై, మా ఎన్డీయే ప్రభుత్వంపై నమ్మకం ఉంచి ఇంత భారీ పెట్టుబడి పెట్టడానికి ముందుకు వచ్చినందుకు ఆర్సెలర్ మిట్టల్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ లక్ష్మీ మిట్టల్, ఏఎంఎన్ఎస్ ఇండియా ఛైర్మన్ ఆదిత్య మిట్టల్, సీఈఓ దిలీప్ ఉమెన్‌లకు ప్రభుత్వం తరఫున హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను" అని అన్నారు.

## తగ్గిన వేరుశనగ ధరలతో రైతులు ఆందోళన



**నరసన్నపేట, పతాకం న్యూస్:** వేరుశనగ ధర ఒక్కసారిగా తగ్గడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వారం రోజుల కిందట 41 కేజీల వేరుశనగ బస్తా ధర రూ.4,500 ఉండగా.. రూ.2,800కు పడిపోయింది. పంట చేతికి అందే సమయంలో వ్యాపారులు సిండికేట్‌గా వ్యవహరించి.. ధర తగ్గించి కొనుగోలు చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. జిల్లాలో ఈ ఏడాది రబీ సీజన్‌లో మొక్కజొన్న తర్వాత అత్యధికంగా వేరుశనగ 12,361 ఎకరాల్లో రైతులు సాగు చేశారు. నరసన్నపేట, పోలాకి, సంతబొమ్మాళి, కోటబొమ్మాళి, ఎల్.ఎన్.పేట, సరుబుజ్జిలి, హిరమండలం, పాతపట్నం, సారవకోట తదితర మండలాల్లో వేరుశనగ పండించారు. నిబంధల ప్రకారం వేరుశనగ క్వింటాల్ బస్తా రూ.10,500కు కొనుగోలు చేయాలి. కానీ జిల్లా అంతటా వ్యాపారులు సిండికేట్‌గా వ్యవహరించి.. ధర 41 కేజీల బస్తాను రూ.2,800కు కొనుగోలు చేస్తున్నారు. మట్టి, రాళ్లు పేరిట దోపిడీకి పాల్పడుతూ.. క్వింటాకు సుమారు రూ.7వేలు మాత్రమే చెల్లిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎకరా సాగుకు సుమారు రూ.25వేలు ఖర్చు కాగా.. పెట్టుబడి కూడా రాని పరిస్థితి నెలకొందని వాపోతున్నారు. పంట దిగుబడి బాగున్నా.. ధర లేక నష్టపోతున్నామని పేర్కొంటున్నారు. కిలో వేరుశనగ విత్తనాలు రూ.150 చొప్పున వ్యాపారులు విక్రయించగా.. ప్రస్తుతం కాయలు మాత్రం రూ.75 చొప్పున కొనుగోలు చేసి దోపిడీకి పాల్పడుతున్నారని ఆరోపిస్తున్నారు. కొంతమంది వ్యాపారులు ఒడిశా నుంచి జిల్లాకు వేరుశనగ పంటను దిగుమతి చేసి.. అక్రమ నిల్వలు చేస్తున్నారని పేర్కొంటున్నారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు చేపడితే వ్యాపారుల వద్ద అక్రమ నిల్వలు బయటపడే అవకాశం ఉందని చెబుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అండగా నిలవాలని, వేరుశగన పంటను మద్దతు ధరకు కొనుగోలు చేసేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

## రోగులకు వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలి



**శ్రీకాకుళం, పతాకం న్యూస్:** కూటమి ప్రభుత్వం ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందని, ముఖ్యంగా ప్రభుత్వ అసుపత్రిలో గర్భి ణులకు సాధారణ ప్రసవాలు జరిగే విధంగా చూ డాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు వైద్యులను ఆదేశించారు. ఆయన స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో వార్డులు, మందుల నిల్వగది, రోగుల నమోదు రికార్డులను పరిశీలించారు. వైద్య పరికరాల పనితీరు అడిగి తెలుసుకున్నారు. వార్డులో రోగులతో మాట్లాడి అం దుతున్న వైద్య సేవలు, సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. రోగులకు అన్ని వేళలా సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. అనంతరం నూతనంగా రూ.2.10 కోట్లతో నిర్మాణం జరుగుతున్న ఆ సుపత్రి అదనపు గదులను ఆయన పరిశీలించారు. త్వరితగతిన పనులు పూ ర్తిచేయాలని సంబంధిత కాంట్రాక్టర్లకు సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర కళింగ కోమటి కార్పొరేషన్ చైర్మన్ బోయిన గోవిందరాజులు, మాజీ పీఏసీఎస్ అధ్యక్షు డు కింజరాపు హరివర ప్రసాద్, టెక్కలి ఆర్డీవో ఎన్.కృష్ణమూర్తి, పీఏసీఎస్ చైర్‌పర్సన్ వెలమల విజయలక్ష్మి, టీడీపీ నాయకులు వెలమల కామేశ్వరరావు, కోరాడ పెద్ద గోవింద్, తదితరులు పాల్గొన్నారు.

## విద్యుదాఘాతంతో ఉపాధ్యాయుడి మృతి

**జియ్యమ్మవలస, పతాకం న్యూస్:** ఎం.హరిపురం గ్రమానికి చెందిన ఉపాధ్యాయుడు మద్రాపు ప్రసాద్ (59) విద్యుదా ఘాతానికి గురై మృతిచెందారు. చినమేరంగి ఎస్ఐ పి.అనీష్ కథనం ప్రకారం.. మద్రాపు ప్రసాద్ ఉదయం తన పొలంలో అరటి పంట చూద్దామని వెళ్లారు. అయితే శుక్ర, శనివారాల్లో వీచిన ఈదురు గాలులకు అరటి తోట మధ్యలో నుంచి వెళ్లిన విద్యుత్ తీగలు తెగి పడి ఉన్నాయి. తీగలను గమనించకుండా వాటి మీదుగా వెళ్లడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడిక క్కడే మృతి చెందారు. ప్రసాద్.. టీకే జమ్ము పంచాయతీ పెదదోడిజ పాఠశాలలో ఎస్‌జీటీగా పనిచేస్తున్నారు. మృతుడికి భార్య ధనలక్ష్మి, కుమార్తె శ్వేత, కుమారుడు సూర్యవంశీ ఉన్నారు. పిల్లలు ఇద్దరు హైదరాబాద్‌లో ఉంటున్నారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ పి.అనీష్, ఏఎస్ఐ కాసులు ఘటపా స్థలానికి వెళ్లి విచారణ చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేశారు.

# ఏపీఐఐసీ అధీనంలోని 51 వేల ఎకరాల మ్యుటేషన్‌కు అనుమతి



**అమరావతి, పతాకం న్యూస్:** ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎపిఐఐసి)కి కేటాయించిన భూములను నిషేధిత ఆస్తుల జాబితా (22-ఎ) నుంచి తొలగించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఇందుకు సంబంధించిన జిఓ 61ను పరిశ్రమలశాఖ కార్యదర్శి ఎన్ యువరాజ్ విడుదల చేశారు. ఈ భూముల్లో పరిశ్రమలు స్థాపించిన వారు తమ ఆస్తులను బ్యాంకుల్లో తాకట్టు పెట్టి రుణాలు పొందలేకపోతున్నారని ఈ నెల 13న జరిగిన మంత్రివర్గంలో చర్చించిన విషయం తెలిసిందే. మంత్రివర్గ నిర్ణయం మేరకు 22ఎ నుంచి తొలగించేందుకు అవసరమైన మార్గదర్శకాలను ప్రభుత్వం విడుదల చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా 14 జోన్లలో 51,603.46 ఎకరాల ప్రభుత్వ, డికెటి, పట్టా భూములను తొలగించనుంది. ఇకపై ఈ భూములు రెవెన్యూ రికార్డుల్లో ఎపిఐఐసి పేరు మీద ఉంటాయి. ఎపిఐఐసి, జిల్లా కలెక్టర్లు మిషన్ మోడ్‌లో పనిచేసి ఎపిఐఐసి స్వాధీనంలో ఉన్నవాటిని గుర్తించి ఎపి ల్యాండ్ మేనేజ్‌మెంట్ అథారిటీకి పంపించాలని కార్యదర్శి యువరాజ్ ఆదేశాలు జారీ చేశారు. ఎపిఐఐసికి ప్రతినెలా వీటిపై నివేదిక ఇవ్వాలని పేర్కొన్నారు. ఎపిఐఐసి జోనల్ మేనేజర్ పరిహారం చెల్లించిన తర్వాత మ్యుటేషన్ కోసం సంబంధిత తహశీల్దార్, ఆర్‌డిఒకు దరఖాస్తు చేసి జిల్లా కలెక్టర్, ఎపిఐఐసి ప్రధాన కార్యాలయానికి కాపీలు పంపాలని తెలిపారు. దరఖాస్తు అందుకున్న వెంటనే తహశీల్దార్.. ఎపిఐఐసి పేరుతో మ్యుటేషన్ చేయాలని ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ పర్యవేక్షణలో 15 రోజుల్లో ఈ ప్రక్రియ పూర్తి కావాలని ఆదేశించారు. తక్షణ రిజిస్ట్రేషన్ కోసం ఎపిఐఐసి జోనల్ మేనేజర్లు.. జిల్లా కలెక్టర్లకు భూముల వివరాలతో ప్రతిపాదనలు సమర్పించాలని తెలిపారు. ప్రభుత్వ ఉత్తర్వులు ఆధారంగా 22-ఎ నుంచి తొలగించడం ఎందుకు అవసరమో వివరించాలని పేర్కొన్నారు. ప్రతిపాదనలు అందుకున్న తర్వాత పరిశీలించి కలెక్టర్లు ఉత్తర్వులు జారీ చేస్తారని వెల్లడించారు. సంబంధిత సబ్ రిజిస్ట్రార్‌కు 22-ఎ నుంచి తొలగించాలనే సమాచారంతో కూడిన ఆదేశాలు కలెక్టర్లు ఇవ్వాలి. కలెక్టర్ల ఉత్తర్వుల ఆధారంగా జిల్లా రిజిస్ట్రార్ ఈ భూములను ఎపిఐఐసి పేరుతో రిజిస్ట్రేషన్ చేసేందుకు అనుమతినిస్తారు.

# రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి



**ఏలూరు, పతాకం న్యూస్:** ఓ కారు డ్రైవర్ నిద్రమత్తు ముగ్గురి ప్రాణాలను మింగేసింది. తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలం యర్నగూడెం బైపాస్ ఫ్లైఓవర్ వద్ద ఉదయం 7 గంటలకు ఓ కారు వేగంగా వెళ్తూ.. మరో రెండు కార్లను ఢీకొంది. ఈ ఘటనలో ముగ్గురు మృతిచెందగా మరో నలుగురికి తీవ్రగాయాలయ్యాయి. ఎస్ఐ సుబ్రహ్మణ్యం కథనం ప్రకారం.. కాకినాడకు చెందిన సిరియాదుల సత్యనారాయణ (53), కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం మల్లిసాల గ్రామానికి మామిడాల నారాయణమూర్తి (52), మరికొందరు ఎర్రచందనం మొక్కల కోసం ఆదివారం తెల్లవారుజామును కాకినాడ నుంచి ఏలూరు జిల్లా కణిగిరికి యెర్టిగా కారులో బయలు దేరారు. యర్నగూడెం బైపాస్ ఫ్లై ఓవర్ వద్దకు వచ్చేసరికి.. డ్రైవింగ్ చేస్తున్న కాకినాడ సర్పవరం జంక్షన్‌కు చెందిన బల్లా చిట్టిబాబు కారు నడుపుతుండగా.. నిద్రమత్తులో అదుపుతప్పి డివైడర్ దాటుకుని అవతలి రోడ్డులోకి దూసుకుపోయిం ది. ఆ రోడ్డులో ఏలూరు, రాజహేంద్రవరం నుంచి వస్తున్న రెండు కార్లను ఢీకొంది. అందులో ఒక కారులో ఉన్నవారికి ఏం కాలేదు. మరో కారులో ఉన్న ఏలూరు తం గెళ్ళమూడి ప్రాంతానికి చెందిన మహ్మద్ సలీం సిస్టి (44) మృతిచెంచాడు. శనివారం కుటుంబీకులతో రంజాన్ పండుగ చేసుకుని ఆదివారం ఉదయం ఆనందంగా ఇంటి నుంచి బయలుదేరిన కాసేపటికే మృత్యువాతపడినట్టు కుటుంబీకులకు సమాచారం అందడంతో వారు కన్నీరుమున్నీరుగావిలపించారు. ప్రమాదానికి కారణమైన యెర్టిగా కారులో ఉన్న సిరియాదులసత్యనారాయణ, మామిడాల నారా యణమూర్తి అక్కడికక్కడే మృతిచెందారు. కాకినాడ సర్పవరం జంక్షన్‌కు చెందిన డ్రైవర్ బల్లా చిట్టిబాబు సహా, మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. సీఐ బీఎన్.నాయక్ సిబ్బందితో ఘటనా స్థలాన్ని పరిశీలించి, కేసు దర్యాప్తు చేపట్టారు.

# ఆలయాల స్వయం ప్రతిపత్తిపై అవగాహన




**పాలకొండ, పతాకం న్యూస్:** పట్టణంలో ఆదివారం దేవాలయాల స్వయం ప్రతి పత్తిపై విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు చింత భాస్కర్ నాయుడు, జిల్లా కార్యదర్శి కె.రామకృష్ణ అవగాహన సదస్సు నిర్వహించారు. సద స్సుకు ముఖ్యవక్తగా విశ్వ హిందూ పరిషత్ రాష్ట్ర సంఘ టన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి హాజరై మాట్లాడారు. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 78 ఏళు పూర్తయినా హిందువులకు దేవాల యాలను నిర్వహించుకునే స్వతంత్రత నేటికీ రాలేదన్నారు. దేవాల యాల స్వయం ప్రతిపత్తి కోసం దేవదాయ ధర్మదాయ చట్టం స్థానంలో ఒక నమూనా డ్రాఫ్ట్ తయారు చేశామన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ్ సాయిరాం నూతన ముసాయిదా చట్టాన్ని వివరించారు. కార్యక్రమంలో ముసాయిదా కరదీపికలను పంపిణీ చేశారు.

# ప్రమాదభరితంగా మారిన ఘాట్ ప్రయాణం



**పాడేరు, పతాకం న్యూస్:** పాడేరు నుంచి మైదాన ప్రాంతాలకు వెళ్లే ఘాట్ మార్గంలోని రక్షణ గోడలు మరమ్మతులకు నోచుకోలేదు. గిరిజన ప్రాంతంలో రాకపోకలకు ఎంతో ప్రధానమైన ఘాట్ రోడ్డును మరింతగా అభివృద్ధి చేసి, ప్రమాదాలను నివారించడంతోపాటు పర్యాటకుల్ని ఆకర్షించేలా తీర్చిదిద్దాల్సి ఉండగా పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. దీంతో నిత్యం ఘాట్‌లో ఏదో ప్రాంతంలో వాహనాలు ప్రమాదానికి గురవుతూనే ఉన్నాయి. రక్షణ గోడలు పటిష్టంగా లేకపోవడంతో భయం భయంగా రాకపోకలు సాగించాల్సి వస్తుందని డ్రైవర్లు అంటున్నారు. స్థానిక ఘాట్ మార్గంలోని రక్షణ గోడలు చాలా కాలంగా కనీసం మరమ్మతులకు నోచుకోని దుస్థితి కొనసాగుతున్నది. అయితే 2023 ఆగస్టు 20న ఘాట్‌లోని ఆర్‌టీసీ బస్సు బోల్తా పడిన ఘటనలో ఇద్దరు ప్రమాణికులు మృతి చెందగా.. 31 మంది గాయపడిన ఘటన నేపథ్యంలో అప్పటి కలెక్టర్ సుమిత్‌కుమార్ రక్షణ గోడల మరమ్మతులు చేపట్టాలని ఆర్‌అండ్‌బీ అధికారులను ఆదేశించారు. దీంతో ఘాట్‌లోని అన్ని మలుపుల వద్ద ఉన్న రక్షణ గోడలకు మరమ్మతులు జరుగుతాయని భావించినప్పటికీ, అందుకు భిన్నంగా రెండు, మూడు మలుపుల్లో మాత్రమే చేసి చేతులు దులుపుకొన్నారు. చివరకు చేసిన ఆ పనులు సైతం నాణ్యత లేకపోవడంతో ప్రస్తుతం అవన్నీ శిథిలమైపోయాయి. ఇదిలా ఉండగా ఇన్నాళ్లు డివిజన్ కేంద్రంగా ఉన్న పాడేరు ప్రస్తుతం జిల్లా కేంద్రం కావడంతో ఘాట్ మార్గంలో రాకపోకలు పెరిగాయి. ఈ క్రమంలో స్థానిక ఘాట్ రక్షణపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టాల్సి అవసరం ఉంది. కాని గత వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. పాడేరు నుంచి చోడవరం, అనకాపల్లి, విశాఖపట్నం ప్రాంతాలకు రాకపోకలు సాగించాలన్నా, ఆయా ప్రాంతాల నుంచి పాడేరుతోపాటు ఒడిశా రాష్ట్రానికి వెళ్లాలన్నా ఘాట్ ప్రయాణం తప్పనిసరి. ఇంతటి ప్రాధాన్యత ఉన్న ఘాట్ మార్గంలో రక్షణపై పాలకులు దృష్టి సారించకపోవడం ఘోరమని ప్రయాణికులు అంటున్నారు. ముఖ్యంగా ఘాట్‌లోని వ్యూపాయింట్‌కు సమీపంలో, రాజాపురం సమీపంలో, ఏసుప్రభు బొమ్మ మలుపునకు అటూ..ఇటూ.. వంట్లమామిడి నుంచి గరికిబంద వరకు ఉన్న మలుపుల్లో రక్షణ గోడలు ఘోరంగా శిథిలమైపోయాయి. పొరపాటున ఏదైనా వాహనాలు అదుపు తప్పితే లోయలోకి దూసుకుపోవాల్సిందే. గతంలో నిర్మించి రక్షణ గోడలు శిథిలం కాగా, చాలా ఏళ్లుగా కొత్తగా రక్షణ గోడలు నిర్మించకపోవడంతో ఘాట్ ప్రయాణం ప్రమాదకరంగా మారింది.

స్థానిక ఘాట్ మార్గంలో ప్రమాదకరంగా ఉన్న మలుపుల వద్ద ఐరన్ గడ్డర్లను ఏర్పాటు చేయాలని చాలా కాలంగా రోడ్ల, భవనాల శాఖాధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదిస్తున్నప్పటికీ కార్యరూపం దాల్చడం లేదు. ఇదే విషయమై 2022లో అప్పటి ఐటీడీఏ పీవో రోణంకి గోపాలకృష్ణ సైతం ఘాట్ మార్గంలో అవసరమైన చోట్ల మరమ్మతులు చేపట్టాలని రోడ్ల, భవనాల శాఖ ఉన్నతాధికారులను కోరారు. అందుకుగానూ రూ.8.5 కోట్లతో ప్రతిపాదనలు చేశారు. ఆయా నిధులు మంజూరైతే ఘాట్‌లోని ప్రమాదకరంగా ఉన్న మలుపులను సరిచేయడంతోపాటు, వాహనాలు అదుపు తప్పి లోయల్లోకి బోల్తా కొట్టకుండా పటిష్టమైన ఐరన్ గడ్డర్లను ఏర్పాటు చేయాలని భావించారు. ఇదే తరహాలో రోడ్ల, భవనాల శాఖాధికారులు సైతం పలుమార్లు ప్రతిపాదనలు చేస్తున్నప్పటికీ ఏవీ నేటికీ కార్యాచరణకు నోచుకోలేదు. అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తున్న ప్రస్తుత కూటమి ప్రభుత్వమైన ఘాట్ మార్గంలోని రక్షణ గోడలకు మరమ్మతులు చేపట్టాలని ప్రయాణికులు, డ్రైవర్లు కోరుతున్నారు.

# డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం




**రాజమహేంద్రవరం, పతాకం న్యూస్:** రాజమహేంద్రవరం నగరంలో 'డ్రగ్స్ రహిత సమాజం కోసం నడుద్దాం' అనే నినాదంతో ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో అవగాహన వాక్ నిర్వహించారు. ఈ వాక్‌ను త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ ఎస్ఐ సురేష్ జెండా ఊపి ప్రారంభించారు. సెంట్రల్ జైలు పార్క్ నుంచి పుష్కర ఘాట్ వరకు ఈ వాక్ సాగింది. ఈ కార్యక్రమంలో సుమారు 200 మంది విద్యార్థులు, యువత మరియు సామాజిక కార్యకర్తలు పాల్గొన్నారు. డ్రగ్స్ వల్ల సమాజంపై పడుతున్న తీవ్రమైన ప్రభావాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వై.భాస్కర్, ఎన్.రాజా, డివైఎఫ్ఐ కన్వీనర్ వి. రాంబాబు మాట్లాడుతూ ఇటీవలి కాలంలో యువత ఎక్కువగా డ్రగ్స్‌కు అలవాటు పడుతున్న పరిస్థితి ఆందోళన కలిగిస్తోం దన్నారు. డ్రగ్స్ వినియోగం యువత భవిష్యత్తును చీకటిలోకి నెడుతున్నదని చెప్పారు. ఇది కేవలం వ్యక్తిగత సమస్య కాకుండా సమాజానికి కూడా పెద్ద ముప్పుగా మారుతోందని తెలిపారు. డ్రగ్స్ సమస్యను పూర్తిగా నిర్మూలించడానికి ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని, డ్రగ్స్ సరఫరా చేస్తున్న మాఫియాపై కఠిన చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. అలాగే పాఠశాలలు, కళాశాలల్లో నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహించా ల్సిన అవసరం ఉందని సూచించారు. ఈ కార్యక్ర మంలో ఎస్ఎఫ్ఐ పూర్వ నాయకులు టి.అరుణ్ మాట్లాడుతూ అత్యంత చిన్న వయస్సుల్లోనే భగత్ సింగ్, రాజగురు, సుఖ్దేవ్‌లు కలిసి స్వాతంత్ర్య ఉద్యమంలో పోరాడి తమ ప్రాణాలను తృణప్రా యంగా ఈ దేశం కోసం అర్పించి దేశ యువతను సరైన దిశ, మార్గ నిర్దేశం చేసి స్వాతంత్ర్య ఉద్యమం లో నిలిపారని అన్నారు. ప్రస్తుతం సమాజంలో యువత డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలకు బానిసలు అవుతున్నారని అన్నారు. ఈ మత్తు పదార్థాలను అరికట్టాలని, అలాగే ఎవరైతే వీటిని సరఫరా చేస్తున్నారో వాళ్ళ మీద కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మత్తు పదార్థాలకు అరికట్టాలని ప్రజలను చైతన్య పరుస్తూ పోరాడు తున్న నెల్లూరులో యువజన నాయకుడు పెంచ లయ్యను గంజాయి మాఫియా చంపేసిన ప్రభు త్వం స్పందించలేదని, గంజాయి మాఫియాపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. ఎస్ఎఫ్ఐ, డివై ఎఫ్ఐ 55 సంవత్సరాలుగా గంజాయికు వ్యతి రకంగా పోరాడుతుందని అన్నారు. ఈ కార్యక్రమం లో ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా కార్యదర్శి బి.పవన్, పూర్వ నాయకులు జె.రాంబాబు, ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు కె.జ్యోతి, సాహితి, సౌమ్య, కార్తిక్, కనక, శివ బాలాజీ, డివైఎఫ్ఐ నాయకులు సాయి, నాని తదితరులు పాల్గొన్నారు.

# పాడి అభివృద్ధితోనే పల్లెల ప్రగతి

**విజయనగరం, పతాకం న్యూస్:** పాడిపశువుల అభివృద్ధితోనే పల్లెలు ప్రగతి సాధిస్తామని రాష్ట్ర సూ క్ష్మ, చిన్న, మధ్య తరహా, ఎస్ఎంఈ, సెర్ప్, ఎన్ఆర్ఐ సాధికార సంబంధాల శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివా స్ అన్నారు. దేవుపల్లి గ్రామంలో గజపతినగరం ఏఎం సీ అధ్యక్షుడు పీవీవీ గోపాలరాజు ఆధ్వర్యంలో నిర్వ హించిన ఉచిత పశువైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. తొలుత లేగదూడల ప్రదర్శనను ప్రారంభించి.. అనంతరం రైతన్న మీకోసం కరపత్రా లను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఏర్పాటుచేసిన సదస్సులో ఆయన మాట్లాడుతూ పాడి పరిశ్రమ అభి వృద్ధితోనే పల్లెలు ఆర్థికాభివృద్ధి సాధిస్తాయన్నారు. రానున్న వేసవిలో పశు గ్రాసం కొరత లేకుండా రాష్ట్ర ప్రభుత్వం వందశాతం రాయితీపై పశుగ్రాస పెంప కానికి ప్రోత్సాహం అందిస్తుందన్నారు. పశుగ్రాస పెంప కానికి అవసరమైన సాగునీరు పొందేందుకు తాను వ్యక్తిగతంగా రూ.20వేలు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. అలాగే మినీ గోకులాలు జిల్లాలో వెయ్యి లక్ష్యం కాగా 1579 మంజూరు చేసి, ఇందులో 773 పూర్తయ్యాయని, మిగిలినవి 906 వివిధ దశల్లో ఉన్నాయని త్వరితగతిన పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. 50 శాతం రాయితీపై పశుదాణా, పశు గ్రాస విత్తనాలు అందిస్తున్నట్టు చెప్పారు. అలానే పాడి అభివృద్ధికి ఆడదూడలు పుట్టేందుకు వీలుగా వీర్యదా నం ఇంజక్షన్లు సిద్ధంగా ఉన్నాయన్నారు. అలానే 35 శాతం రాయితీతో మందులు అందించేందుకు గొల్లు పాలెం గ్రామంలో జనరిక్ మందుల షాపు త్వరలో నెలకొల్పనున్నామని తెలిపారు. అలానే రైతులు రుణా లు పొందేందుకు కిసాన్ క్రెడిట్ కార్డులు అందించామ ని తెలిపారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ జేడీ డా.ఎన్.దామోదరరావు, ఏడీ డా.అనూరాధ, ఏఎం సీ ఉపాధ్యక్షులు కొరాడ కృష్ణ, టీడీపీ మండల అధ్యక్షు డు రాపాక అచ్చంనాయుడు, సర్పంచ్ నడుపూరి భా స్కరనాయుడు, కర్రోతు శ్రీనివాసరావు, పాచల సీతా రాం, ఈదుబిల్లి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



# విజయమ్మ లేఖ నిజం.. దమ్ముంటే జగనే సమాధానం చెప్పాలి: షర్మిల

**అమరావతి, పతాకం న్యూస్:** తమ కుటుంబ ఆస్తుల వివాదంపై ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రస్థాయిలో స్పందించారు. తన సోదరుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డిపై సంచలన ఆరోపణలు చేశారు. వివేకా నంద రెడ్డి హత్య కేసును పక్కదారి పట్టిం చేందుకే వైసీపీ నేతలు ఆస్తుల వివాదాన్ని తెరపైకి తెస్తున్నారని ఆమె మండిపడ్డారు. తన తల్లి వైఎస్ విజయమ్మ విడుదల చేసిన లేఖలోని ప్రతి అక్షరం నిజమని, దమ్ముంటే ఆ లేఖపై జగనే నేరుగా మాట్లాడాలని సవాల్ విసిరారు. సోమ వారం ఆమె మీడియా సమావేశంలో మాట్లాడుతూ, వైసీపీ నేతలపై అత్యంత ఘాటు వ్యాఖ్యలు చేశారు. వివేకానంద రెడ్డిది హత్య అని తాను నిజం మాట్లాడటమే నేరమైందని షర్మిల ఆవేదన వ్యక్తం చేశారు. "నిజం చెప్పినందుకే నాపై ఇంతగా విరుచుకు పడుతున్నారు. వివేకా హత్య కేసులో సాక్షి మీడియా ఏడు గంటల పాటు గుండెపోటు అని ఎందుకు ప్రచారం చేసిందో చెప్పే ధైర్యం వైసీపీ నేతలకు లేదన్నారు.

## అంగన్వాడీల వేతనాల పెంపు కోరుతూ మరో పోరాటం




**అమరావతి, పతాకం న్యూస్:** రాష్ట్రంలో అంగన్‌వాడీ వర్కర్స్‌కు, హెల్పర్స్‌కు వేతనాలు పెంచాలని కోరుతూ మరోమారు దశలవారీ పోరాటం చేయాలని ఆంధ్రప్రదేశ్ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర కమిటీ నిర్ణయించింది. యూనియన్ రాష్ట్ర కమిటీ సమావేశం ఉపాధ్యక్షులు సిహెచ్ సుప్రజ అధ్యక్షతన విజయవాడలోని ఎంబివికెలో నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీలకు వేతనాల పెంపు, హెల్పర్లకు పదోన్నతులకు నియమ నిబంధనలు ఉత్తర్వులు సవరణ, గ్రాట్యూటీ అమలు, మే నెలలో వేసవి సెలవులు, ఇతర సమస్యలపై పోరాటం కొనసాగించాలని నిర్ణయించారు. యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె సుబ్బరావమ్మ మాట్లాడుతూ.. శాసనసభ బడ్జెట్ సమావేశాలు సందర్భంగా అంగన్‌వాడీల వేతనాలు పెంచాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని ఫిబ్రవరి 22 నుంచి 27వ తేదీ వరకూ అన్ని జిల్లాల్లో రిలే నిరాహార దీక్షలు, ఈ నెల 2న విజయవాడలో మహాధర్నా చేసి డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. గతేడాది కాలంగా వివిధ రూపాల్లో సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామన్నారు. ప్రభుత్వం వైపు నుంచి ఎటువంటి స్పందన లేదన్నారు. ఈ నెల 2న శాంతియుతంగా ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలపై అత్యంత దుర్మార్గంగా ముసుగులు వేసి అక్రమ అరెస్టులకు ప్రభుత్వం పాల్పడిందన్నారు. ఈ నెల 10న మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి చర్చలకు యూనియన్ నాయకులను పిలిచి, మొండిచేయి చూపారన్నారు. అంగన్‌వాడీలు 42 రోజులు సమ్మె సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన హామీలు నిలబెట్టుకోలేదని, ప్రభుత్వంపై పోరాటం చేస్తే వేతనాలు కట్ చేస్తామని బెదిరింపులకు పాల్పడుతున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే కొన్ని జిల్లాల్లో అధికారులు 3 నుంచి 4 రోజులు వేతనం కట్ చేస్తామని చెబుతున్నారని, దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. బెదిరింపులతో తమ పోరాటాన్ని అణచివేయలేరని హెచ్చరించారు. మరోసారి దశలవారీ పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఎ నాగశేషు, కోశాధికారి బి లకీదేవి, రాష్ట్ర నాయకులు పి రోజా, ఇ చంద్రావతి, కృష్ణవేణి, రమాదేవి, నిర్మల, భాగ్యలక్ష్మి, బేబిరాణి, సుధారాణి, కుమారి, కోకిల, సుజాత తదితరులు పాల్గొన్నారు.

## శ్లాబు కూలి ఇద్దరు ఎలక్ట్రీషియన్ల మృతి



**హైదరాబాద్, పతాకం న్యూస్:** హైదరాబాద్‌లోని బేగంపేటలో ఘోర ప్రమాదం జరిగింది. ఓ అపార్ట్‌మెంట్‌లోని బాల్కనీ శ్లాబు కూలిపోవడంతో ఇద్దరు ఎలక్ట్రీషియన్లు అక్కడికక్కడే మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. పంజాగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలోని కుందన్‌బాగ్, మెథడిస్ట్ కాలనీలో ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం, మూడో అంతస్తులోని తన ఫ్లాట్‌లో ఎలక్ట్రికల్ పనుల కోసం ఇంటి యజమాని దివాకర్ ప్రసాద్ ఇద్దరు ఎలక్ట్రీషియన్లను పిలిపించారు. ఆసిఫ్‌నగర్‌కు చెందిన దేవిదాస్ (56), వివేక్ (32) పనులు చేస్తుండగా, యజమాని దివాకర్ బాల్కనీలో నిల్చుని ఉన్నారు. ఈ క్రమంలో బాల్కనీ శ్లాబు ఒక్కసారిగా కూలిపోవడంతో ముగ్గురూ కిందపడిపోయారు. ఈ దుర్ఘటనలో దేవిదాస్, వివేక్ అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన దివాకర్ ప్రసాద్‌ను ఆసుపత్రికి తరలించగా, ఆయన పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ప్రజా సంక్షేమమే కూటమి ధ్యేయం

**కడియం, పతాకం న్యూస్:** ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తుందని ఎంఎల్‌ఎ గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. మండలంలోని మాధవరాయుడుపాలెం పంచాయతీ పరిధిలోని చైతన్య నగర్‌లో రూ.87 లక్షలతో చేసిన అభివృద్ధి పనులను సర్పంచ్ అన్నందేవుల చంటితో కలిసి ఆయన ప్రారంభించారు. జలజీవన్ మిషన్ పథకంలో రూ.51 లక్షలతో నిర్మించిన వాటర్ ట్యాంకును, నూతన మంచినీటి కులాయిలను, జడ్‌పి హైస్కూల్‌లో రూ.24 లక్షలతో నిర్మించిన రెండు అదనపు తరగతి గదులు, రూ.12 లక్షలతో నిర్మించిన అంగన్‌వాడీ భవనాన్ని ఎంఎల్‌ఎ గోరంట్ల ప్రారంభించారు. అలాగే రూ.10 లక్షలతో నిర్మించనున్న బిసి కమ్యూనిటీ హాల్‌కు శంకుస్థాపన చేశారు. సర్పంచ్ అన్నదేవుల చంటి అధ్యక్షతన జరిగిన సమావేశంలో గోరంట్ల మాట్లాడారు. పారిశ్రామికవాడగా అభివృద్ధి చెందుతున్న చైతన్య నగర్‌లో ప్రతి సమస్యకు పరిష్కారం చేస్తానని హామీ ఇచ్చారు. సర్పంచ్ చంటి ఆకాంక్ష మేరకు గ్రామంలో రెండవ హైస్కూల్ తీసుకురావడం జరిగిందన్నారు.

## రూ.17.30 లక్షల సొత్తు స్వాధీనం



**తెనాలి, పతాకం న్యూస్:** చోరీ కేసుల్లో ముగ్గుర్ని అరెస్టు చేసిన పోలీసులు వారి నుండి రూ.17.30 లక్షల సొత్తును స్వాధీనం చేసుకున్నారు. తెనాలిలోని సోనోవిజన్‌లో ఇటీవల జరిగిన చోరీ కేసులో నిందితులు మైనర్లు కావడం గమనార్హం. ఆయా చోరీలు, అరెస్టులపై వివరాలను పోలీసులు వెల్లడించారు.తెనాలి పట్టనంలోని ప్రధాన వ్యాపార కూడలి సోనోవిజన్‌లో చోరీ కేసులో ఇద్దర్ని అరెస్టు చేసి వారి నుంచి రూ.11.80 లక్షల విలువైన సెల్ఫోన్లు, ఇతర ఉపకరణాలు స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ బి.జనార్ధనరావు స్థానిక టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో విలేకర్లకు వివరించారు. ఈనెల 15 అర్ధరాత్రి దాటిన తర్వాత రత్నాటాకీస్ కూడలిలోని సోనోవిజన్ షోరూం పైఅంతస్తు అద్దాలు పగులగొట్టి నిందితులు చోరీకి పాల్పడ్డారు. 16న ఉదయాన్నే విషయం తెలుసుకున్న షోరూమ్ మేనేజర్ తమ్మా మధుసూదన్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో దర్యాప్తు చేపట్టారు. పట్టణంలోని ముత్తింశెట్టివారిపాలేనికి చెందిన 17 ఏళ్ల మైనర్ యువకుడు, చినరావూరు పాత డిపో సెంటర్‌కు చెందిన 16 ఏళ్ల మైనర్ యువకుడు నిందితులుగా అరెస్టు చేశారు. వీరిలో ఒకరిపై త్రీ టౌన్ పోలీస్ స్టేషన్లో మూడు కేసులు, వన్ టౌన్ పోలీస్ స్టేషన్లో రెండు, రూరల్ పోలీస్ స్టేషన్లో ఒక కేసులు ఇప్పటికే నమోదై ఉన్నాయి. ఇతని చిన్నతనంలోనే తల్లిదండ్రులు చనిపోవడంతో సోదరి వద్ద ఉంటూ క్యాటరింగ్ పనులకు వెళుతుండేవాడు. ఈ క్రమంలో వ్యసనాలకు బానిసవడంతోపాటు దొంగతనాలకు అలవాటుపడ్డాడు. బైకులను దొంగిలించి విక్రయించి జల్సాగా గడిపేవాడు. రెండు చోరీ కేసుల్లో 9 నెలలు జైలు శిక్ష పడగా విజయవాడ జువైనల్ హోమ్‌లో శిక్ష అనుభవించి, నాలుగు నెలల క్రితం బయటకు వచ్చాడు. తిరిగి దొంగతనాలకు పాల్పడే క్రమంలో ఇంటర్ చదువుతూ చెడు వ్యసనాలకు బానిసైన మరో నిందితునితో పరిచయం ఏర్పడింది. ఇద్దరూ కలిసి సోనోవిజన్ షోరూంలో దొంగతనానికి పన్నాగం పన్నారు. ఈనెల 15 అర్ధరాత్రి దాటిన తరువాత సోనోవిజన్ షోరూం రెండో అంతస్తు అద్దాలు పగుల తొట్టి లోనికి ప్రవేశించారు. సాంసంగ్ మొబైల్స్ 8, వివో మొబైల్స్ 3, ఆపిల్ మొబైల్స్ 7, సాంసంగ్ వాచెస్ రెండు, చార్జర్లు, బ్లూటూత్ వంటి సుమారు రూ.12 లక్షల వస్తువులు అపహరించారు. కేసు నమోదైన విషయం తెలుసుకొని అప్పటి నుంచి పరారీలో ఉన్న వీరు స్థానిక గాంధీ నగర్‌లో ఉన్నట్లు పోలీసులు తెలుసుకొని అదుపులోకి తీసుకున్నారు. వారు అపహరించిన వాటిలో రూ.11.80 లక్షల విలువైన వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. త్వరితగతిన కేసులు చేధించిన టూ టౌన్ సిఐ, సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించినట్లు డీఎస్పీ తెలిపారు. సమావేశంలో ఎస్ఐ, సిబ్బంది పాల్గొన్నారు.

# శరీరానికి ఐరన్ లభించాలంటే..!

వేసవిలో శరీరానికి ఐరన్ లభించాలంటే.. ఈ ఆహారాలను తీసుకోవాలి.. ఇనుము మనిషి శరీరానికి అత్యంత అవసరమైన ఖనిజం. ఇది హిమోగ్లోబిన్ తయారీలో కీలక పాత్ర పోషిస్తుంది. హిమోగ్లోబిన్ రక్తం ద్వారా ఆక్సిజన్‌ను శరీరమంతా చేరవేయడానికి సహాయపడుతుంది. శరీరంలో ఇనుము సరిపడినంత ఉండటం వల్ల శక్తి స్థాయిలు, మెదడు పనితీరు మెరుగ్గా ఉంటాయి. ఇనుము మనిషి శరీరానికి అత్యంత అవసరమైన ఖనిజం. ఇది హిమోగ్లోబిన్ తయారీలో కీలక పాత్ర పోషిస్తుంది. హిమోగ్లోబిన్ రక్తం ద్వారా ఆక్సిజన్‌ను శరీరమంతా చేరవేయడానికి సహాయ పడుతుంది. శరీరంలో ఇనుము సరిపడినంత ఉండటం వల్ల శక్తి స్థాయిలు, మెదడు పనితీరు మెరుగ్గా ఉంటాయి. ఇనుము లోపం వల్ల అనీమియా అనే సమస్య ఏర్పడుతుంది. ఈ సమస్య భారతీయ మహిళల్లో ఎక్కువగా కనిపిస్తుంది. దీని వల్ల అలసట, బలహీనత, రోగనిరోధక శక్తి తగ్గడం వంటి సమస్యలు వస్తాయి. అలాగే శరీరంలోని పలు ముఖ్యమైన ప్రక్రియలకు కూడా ఇనుము అవసరం. ఇనుము స్థాయిని పెంచుకోవడానికి సరైన ఆహారం తీసుకోవడం అత్యంత ప్రభావవంతమైన మార్గం. ఆహారాల్లో హీమ్ ఐరన్ (జంతు ఆహారాల్లో), నాన్-హీమ్ ఐరన్ (మొక్కల ఆహారాల్లో) అనే రెండు రకాల ఐరన్ లభిస్తాయి. ఈ రెండింటినీ సమతుల్యంగా తీసుకోవడం వల్ల శరీరానికి అవసరమైన ఇనుము అందుతుంది. వేసవిలో ఐరన్ ను



అందించే అనేక భారతీయ ఆహారాలు మనకు అందుబాటులో ఉన్నాయి.

వేసవిలో ఐరన్‌ను పెంచుకోడానికి దానిమ్మ పండు మంచి ఎంపిక. ఇందులో యాంటీఆక్సిడెంట్లు, ఇనుము, ఫైబర్, పొటాషియం వంటి అనేక పోషకాలు ఉంటాయి. ఇది గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో, జీర్ణక్రియను సులభతరం చేయడంలో, రోగనిరోధక శక్తిని పెంచడంలో సహాయపడుతుంది. పాలకూర కూడా ఇనుముకు మంచి వనరు. ఇది నాన్-హీమ్ ఐరన్ కలిగి ఉండటంతో శరీరానికి ఉపయోగపడుతుంది. దీనిని సలాడ్లు, పప్పు లేదా స్మూతీల రూపంలో తీసుకోవచ్చు. బీట్‌రూట్ రక్త ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. ఇది రెడ్ బ్లడ్ సెల్స్ ఉత్పత్తిని పెంచడంలో సహాయపడుతుంది. వేసవిలో దీన్ని సలాడ్ లేదా రైతా రూపంలో తీసుకోవచ్చు. పప్పులు, శనగలు వంటి ఆహారాలు కూడా మంచి ఐరన్ వనరులు. ఇవి శాకాహారులకు ఉత్తమమైన ఎంపికగా నిలుస్తాయి, రోజువారీ ఆహారంలో సులభంగా చేర్చుకోవచ్చు. పుచ్చకాయలో ఇనుము తక్కువగా ఉన్నప్పటికీ, వేసవిలో శరీరాన్ని హైడ్రేట్ చేయడంలో ఇది ఎంతో ఉపయోగపడుతుంది. ఇది దాహాన్ని తీర్చడంలో కూడా సహాయపడుతుంది. బెల్లం సహజంగా ఇనుము అందించే ఆహారం. చక్కెరకు బదులుగా కొద్దిగా బెల్లం తీసుకోవడం వల్ల శరీరానికి కొంత ఇనుము లభిస్తుంది. అయితే దీనిని మితంగా మాత్రమే తీసుకోవాలి.

మునగలో ప్లాంట్-బేస్డ్ ఐరన్ అధికంగా ఉంటుంది. ఇందులో విటమిన్ సి కూడా ఉండటంతో ఐరన్ శోషణను మెరుగుపరుస్తుంది. అందువల్ల ఇది ప్రత్యేకంగా ఉపయోగకరమైన ఆహారమని చెప్పవచ్చు. ఇవే కాకుండా గింజలు, విత్తనాలు, పూర్తి ధాన్యాలు, చేపలు, డ్రై ఫ్రూట్స్ కూడా ఐరన్ మంచి వనరులుగా పరిగణించబడతాయి. ఈ ఆహారాలను తీసుకోవడంతోపాటు ఐరన్ శోషణను మెరుగుపరచడానికి కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. హీమ్, నాన్-హీమ్ ఐరన్ రెండింటినీ కలిపి తీసుకోవడం మంచిది. అలాగే విటమిన్ సి ఉన్న ఆహారాలను ఐరన్ ఉన్న భోజనంతో తీసుకుంటే శరీరం ఐరన్‌ను సులభంగా గ్రహిస్తుంది. అదేవిధంగా టీ, కాఫీ, కాల్షియం వంటి పదార్థాలను ఐరన్ ఉన్న భోజనంతో కలిసి తీసుకోవడం నివారించాలి, ఎందుకంటే ఇవి ఐరన్ శోషణను తగ్గిస్తాయి. వేసవిలో ఈవిధంగా సరైన ఆహారం, మంచి అలవాట్ల ద్వారా శరీరంలో ఇనుము స్థాయిని సులభంగా పెంచుకోవచ్చు. ఇది ఆరోగ్యాన్ని కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తుందని వైద్యులు తెలియజేస్తున్నారు.

# హైవే నిర్మాణంలో నాణ్యతకు తిలోదకాలు!

## నిర్మించిన ఆరు నెలలకే లంబసింగి-చింతపల్లి మార్గంలో పలు చోట్ల గుంతలు, పగుళ్లు



**చింతపల్లి, పతాకం న్యూస్:** జాతీయ రహదారిని నిర్మించిన ఆరు నెలలకే లంబసింగి- చింతపల్లి మార్గంలో పలు చోట్ల పగుళ్లు, గోతులు ఏర్పడ్డాయి. దీంతో ఈ మార్గంలో ప్రయాణించే వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. గ్రీన్ నేషనల్ హైవేస్ కారిడార్ ప్రాజెక్టులో భాగంగా రాజమహేంద్రవరం పంద్యాలపాలెం ఎన్‌హెచ్-16 నుంచి కొయ్యూరు, చింతపల్లి, లంబసింగి, పాడేరు, అరకు మీదుగా విజయనగరం ఎన్‌హెచ్-26 వరకు 406 కిలోమీటర్లు 516-ఈ జాతీయ రహదారి నిర్మాణం చేపడుతున్న సంగతి తెలిసిందే. ఈ రహదారి నిర్మాణానికి రూ.రెండు వేల కోట్లు అంచనా వ్యయం కాగా, తొలి విడతగా రూ.1,670 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఈ రహదారిని ఆరు ప్యాకేజీలుగా విభజించి నిర్మాణాలు చేపడుతున్నారు. లంబసింగి- చాపరాతిపాలెం ప్యాకేజీలో దాదాపు 90 శాతం రహదారి నిర్మాణాలు పూర్తి చేశారు. అయితే లంబసింగి-చింతపల్లి మార్గంలో రెండు లేయర్లు తారు రోడ్డు నిర్మించి, రోడ్ స్టడ్స్ ఏర్పాటు చేశారు. కాగా ఈ మార్గంలో పలు చోట్ల రోడ్డుపై పగుళ్లు ఏర్పడ్డాయి. రెండో లేయర్ వర్షాలకు కొట్టుకుపోయి గుంతలు ఏర్పడ్డాయి. చింతపల్లి మండల కేంద్రంలో ఏపీఆర్ కళాశాల నుంచి హనుమాన్ జంక్షన్ వరకు ఐదు చోట్ల తారు లేయర్ కొట్టుకుపోయి గుంతలు ఏర్పడ్డాయి. లంబసింగి ప్రారంభం, పెద్దగెడ్డ, లోతుగెడ్డ జంక్షన్ ప్రాంతంలోనూ జాతీయ రహదారిపై పగుళ్లు ఏర్పడ్డాయి. దీంతో జాతీయ రహదారిపై ప్రయాణిస్తున్న వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు. జాతీయ రహదారిపై పగుళ్లు, గుంతలు ఏర్పడి నెల రోజులు కావస్తున్నప్పటికీ సంబంధితశాఖ అధికారులు ఎటువంటి మరమ్మతులు చేపట్టడం లేదు. సాధారణంగా జాతీయ రహదారిని పక్కా నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ నిర్మాణాలు చేపడతారు. అయితే చింతపల్లి- లంబసింగి జాతీయ రహదారిపై ఆరు నెలలకే పగుళ్లు, గుంతలు ఏర్పడడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. స్థానికులు ఈ సమస్యను ఎవరి చెప్పాలో తెలియని పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. జాతీయ రహదారి ఇంజనీరింగ్ అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండడం లేదు. ఎన్‌హెచ్ అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వలనే రహదారిలో నాణ్యతా లోపాలు బయటపడుతున్నాయని ఈ ప్రాంతవాసులు చెబుతున్నారు. ఇప్పటికైనా కలెక్టర్, జాతీయ రహదారి ఉన్నతాధికారులు ఈ సమస్యపై స్పందించి రహదారిపై ఏర్పడిన పగుళ్లు, గుంతలను పూడ్చడంతోపాటు జాతీయ రహదారి నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించే విధంగా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

# ట్రంప్ అల్టిమేటానికి ఇరాన్ కౌంటర్



**ఇరాన్:** హర్మూజ్ జలసంధిని అన్ని దేశాల నౌకల కోసం తెరిచే ఉంచామని, అయితే తమ శత్రు దేశాలకు చెందిన నౌకలను మాత్రం అనుమతించబోమని ఇరాన్ స్పష్టం చేసింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన 48 గంటల అల్టిమేటం నేపథ్యంలో టెహ్రాన్ ఈ కీలక ప్రకటన చేసింది. సమన్వయంతో ముందుకు వచ్చే ఇతర దేశాల నౌకలు సురక్షితంగా ప్రయాణించవచ్చని తెలిపింది. అంతర్జాతీయ మారిటైమ్ ఆర్గనైజేషన్ (ఐఎంఓ)లో ఇరాన్ సీనియర్ ప్రతినిధి అలీ మౌసావి ఈ విషయాలను వెల్లడించారు. జలసంధిలో ప్రస్తుత ఉద్రిక్త పరిస్థితులకు అమెరికా, ఇజ్రాయెల్లే కారణమని ఆయన ఆరోపించారు. తాము దౌత్యానికే ప్రాధాన్యత ఇస్తామని, అయితే దురాక్రమణలను అడ్డుకోవడం కూడా ముఖ్యమని పేర్కొన్నారు. నావికుల భద్రత కోసం ఐఎంవోతో కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. మరోవైపు, 48 గంటల్లోగా హర్మూజ్ జలసంధిని పూర్తిగా తెరవాలని, లేనిపక్షంలో ఇరాన్‌లోని విద్యుత్ కేంద్రాలపై దాడులు చేస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా హెచ్చరించారు. ప్రపంచంలోని మొత్తం చమురు రవాణాలో దాదాపు ఐదో వంతు ఈ జలసంధి నుంచే జరుగుతుంది. దీంతో ఇక్కడ ఎలాంటి అంతరాయం ఏర్పడినా అంతర్జాతీయ ఇంధన మార్కెట్‌పై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంది.

తమ అణు కేంద్రంపై దాడికి ప్రతీకారంగా ఇజ్రాయెల్‌పై ఇరాన్ క్షిపణులతో విరుచుకుపడింది. ఇజ్రాయెల్ దక్షిణ ప్రాంతంలోని డిమోనా, అరద్ నగరాలే లక్ష్యంగా ఈ దాడులు జరిగాయి. ముఖ్యంగా, ఇజ్రాయెల్ ప్రధాన అణు పరిశోధన కేంద్రానికి కేవలం 20 కిలోమీటర్ల దూరంలోనే క్షిపణులు పడటం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఆకాశం నుంచి నిప్పుల వర్షంలా దూసుకొచ్చిన క్షిపణులు జనావాసాలపై పడటంతో తీవ్ర విధ్వంసం జరిగింది. పేలుళ్ల ధాటికి పలు భవనాలు ధ్వంసమయ్యాయి. ఇళ్ల తలుపులు, కిటికీలు ఊడిపడ్డాయి. ఇళ్లలోని సామాగ్రి చెల్లాచెదురుగా పడిపోయింది. ప్రాణభయంతో జనం పరుగులు తీయగా, ఆ ప్రాంతమంతా భయానక వాతావరణం నెలకొంది. దీనికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఇరాన్ దాడిలో పెద్ద సంఖ్యలో పౌరులు గాయపడ్డారు. అరద్ నగరంలో 84 మంది, డిమోనాలో 33 మంది గాయపడినట్లు ప్రాథమిక సమాచారం. వీరిలో 10 మంది పరిస్థితి విషమంగా ఉంది.




# హార్దిక్ కెప్టెన్సీ వదులుకోవాలి.. సూర్యకు అప్పగించాలి: కృష్ణమాచారి శ్రీకాంత్



ముంబై ఇండియన్స్ (ఎంఐ) జట్టులో కెప్టెన్సీ వివాదానికి తెరపడేలా కనిపించడం లేదు. 2024 సీజన్‌లో హార్దిక్ పాండ్యా నాయకత్వంపై మొదలైన చర్చ, 2026 సీజన్‌కు ముందు కూడా కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో భారత మాజీ క్రికెటర్, మాజీ చీఫ్ సెలక్టర్ కృష్ణమాచారి శ్రీకాంత్ ఈ విషయంపై కీలక వ్యాఖ్యలు చేశాడు. హార్దిక్ పాండ్యా స్వయంగా కెప్టెన్సీ బాధ్యతల నుంచి తప్పుకుని, ఇటీవలే భారత జట్టుకు టీ20 ప్రపంచకప్ అందించిన సూర్యకుమార్ యాదవ్‌కు నాయకత్వం అప్పగించాలని సూచించాడు. 2024 ఐపీఎల్ సీజన్‌కు ముందు గుజరాత్ టైటాన్స్ నుంచి హార్దిక్ పాండ్యాను ముంబై ఇండియన్స్ ట్రేడింగ్ ద్వారా జట్టులోకి తీసుకుంది. వచ్చిన వెంటనే ఐదుసార్లు ట్రోఫీ గెలిచిన రోహిత్ శర్మను కాదని హార్దిక్‌ను కెప్టెన్‌గా నియమించడం తీవ్ర వివాదానికి దారితీసింది. ఆ సీజన్‌లో జట్టు పాయింట్ల పట్టికలో అట్టడుగు స్థానంలో నిలవడంతో విమర్శలు మరింత పెరిగాయి. 2025లో జట్టు ప్రదర్శన మెరుగుపడి ప్లేఆఫ్స్‌కు చేరినప్పటికీ, ట్రోఫీ గెలవకపోవడంతో కెప్టెన్సీ మార్పుపై చర్చ అలాగే ఉంది. ఈ క్రమంలో తన యూట్యూబ్ ఛానెల్‌లో మాట్లాడిన శ్రీకాంత్, ముంబై జట్టులోని పరిస్థితిని విచిత్రమైనదిగా అభివర్ణించాడు. “ముంబై యాజమాన్యం, రోహిత్ శర్మ, సూర్యకుమార్ యాదవ్, హార్దిక్ పాండ్యా అందరూ కలిసి కూర్చుని జట్టు భవిష్యత్తుపై స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలి. ఇద్దరు టీ20 ప్రపంచకప్ విజేత కెప్టెన్లు (రోహిత్, సూర్య) హార్దిక్ కింద ఆడటం ఆశ్చర్యంగా ఉంది. ఈసారి సూర్యకుమార్‌ను కెప్టెన్‌గా నియమించి, జట్టు అదృష్టం ఏమైనా మారుతుందేమో చూడాలి” అని శ్రీకాంత్ విశ్లేషించాడు. ఈ సమస్యకు హార్దిక్ పాండ్యానే పరిష్కారం చూపవచ్చని శ్రీకాంత్ అన్నాడు. “ఇటీవల ముగిసిన ప్రపంచకప్‌లో హార్దిక్.. రోహిత్, సూర్యల నాయకత్వంలో ఆడి జట్టు గెలుపులో పాలుపంచుకున్నాడు. కాబట్టి హార్దిక్ స్వయంగా ముందుకు వచ్చి, ‘ఈసారి కెప్టెన్సీ నాకు వద్దు, సూర్యను కెప్టెన్‌గా చేయండి, నేను అతడికి పూర్తి మద్దతు ఇస్తాను’ అని యాజమాన్యానికి చెబితే ఈ వివాదం సద్దుమణుగుతుంది

# అంచనాలను తగ్గట్టు రాణించలేకపోతున్న కోల్‌కతా నైట్‌రైడర్స్



‘అంగట్లో అన్నీ ఉన్నా..’ అన్నట్టుగా ఉంది కోల్‌కతా నైట్‌రైడర్స్ జట్టు పరిస్థితి. పరుగుల సునామీ సృష్టించగల హిట్టర్లకు కొదవలేదు. పైగా ప్రపంచంలోనే అత్యుత్తమ స్పిన్నర్లు తమ అమ్ములపొదిలోనే ఉన్నారు. యువ, అనుభవం కలగలిసిన పేసర్లు ప్రత్యర్థిని దెబ్బతీసేందుకు సదా సిద్ధంగా ఉంటారు. మూడుసార్లు చాంపియన్‌గా నిలిచిన కేకేఆర్ మాత్రం ఇటీవలి కాలంలో అంచనాలను అందుకోలేక పోతోంది. ఇప్పటిదాకా జరిగిన 18 సీజన్లలో పదిసార్లు లీగ్ దశకే పరిమితమైంది. దీనికితోడు చివరి నాలుగేళ్లలో ఒక్కసారి మాత్రమే ప్లేఆఫ్స్ దాకా వచ్చింది. 2025లో అయితే మరీ ఎనిమిదో స్థానంతో నిరాశపర్చింది. అందుకే గత మినీ వేలంలో పది మందిని వదిలేసి బరిలోకి దిగింది. సుదీర్ఘకాలం కేకేఆర్‌తో కొనసాగిన ఆండ్రీ రస్సెల్‌కు ఉద్వాసన పలకగా, బ్యాటింగ్‌ను పటిష్టం చేసుకునేందుకు సైఫర్ట్, ఆలెన్, రచిన్‌లతో పాటు రూ.25.20 కోట్లతో ఆల్‌రౌండర్ కామెరూన్ గ్రీన్‌ను తీసుకుంది. పథిరన, ముజరబానిలతో పేస్ విభాగాన్ని పటిష్టం చేసుకుంది. అలాగే కోచ్‌ను కూడా మార్చి అభిషేక్ నాయర్‌కు బాధ్యతను అప్పగించారు. కేకేఆర్ జట్టు ప్రధానంగా స్వదేశీ, విదేశీ పవర్‌హిట్టర్లతో బలంగా కనిపిస్తుంది. రఘువంశీ, రమణ్‌దీప్, పోవెల్, ఆలెన్, సైఫర్ట్, గ్రీన్, రింకూ, నరైన్ బంతిని బలంగా బాదే సత్తా కలిగి వారే. ముఖ్యంగా ఇటీవలి టీ20 వరల్డ్‌కప్‌లో ఆలెన్, సైఫర్ట్‌ల ఓపెనింగ్ విధ్వంసం అభిమానులకు తెలిసిందే. ఈ సీజన్‌లో వీరినే కొనసాగించే అవకాశం ఉంది. ఇక స్పిన్ బౌలింగ్ కూడా జట్టుకు ప్రధాన ఆయుధంగా ఉంది. వరల్డ్ నెంబర్‌వన్ వరుణ్ చక్రవర్తి, నరైన్‌లకు తోడు తాజాగా రచిన్ కూడా జత చేరాడు. ఈ త్రయం ప్రత్యర్థి జట్లను తికమకపెట్టడం ఖాయం.

కోల్‌కతా పేస్ విభాగం గాయాల సమస్యను ఎదుర్కొంటోంది. ఇప్పటికే కీలక హర్షిత్ రాణా పూర్తి సీజన్‌కు దూరమవ్వడం గట్టి దెబ్బే. రూ.18 కోట్లతో తెచ్చుకున్న పథిరన ఫిట్‌నెస్‌ను నిరూపించుకోవాల్సివుంది. పైగా గతేడాది తను చెన్నై తరఫున రాణించలేకపోయాడు. ఇక జింబాబ్వే పేసర్ ముజరబానికి ఐపీఎల్ అనుభవం లేదు. దేశవాళీ పేసర్లు వైభవ్ అరోరా, కార్తీక్ త్యాగి, ఆకాశ్ దీప్, ఉమ్రాన్ మాలిక్, సోలంకి ఏమేరకు ప్రభావం చూపుతారనేది సందేహమే. జట్టు తొలి మ్యాచ్ వాంఖడేలో ఉండడంతో అక్కడి వికెట్‌పై వీరి పేస్ బలహీనత బయటపడే అవకాశముంది. అలాగే కెప్టెన్ రహానె గతేడాది పెద్దగా ప్రభావం చూపలేకపోయాడు. అటు బ్యాటర్‌గానూ విఫలమయ్యాడు.




# ఏప్రిల్ 3న 'రాకాస' విడుదల



మెగా డాటర్ నిహారిక కొణిదెల నిర్మాతగా, యంగ్ హీరో సంగీత్ శోభన్, నయన్ సారిక జంటగా నటించిన సరికొత్త చిత్రం 'రాకాస'. ఫాంటసీ కామెడీ థ్రిల్లర్ జోనర్‌లో రూపొందుతున్న ఈ చిత్రం ఏప్రిల్ 3వ తేదీన ప్రపం చవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ చిత్ర ప్రమోషన్స్‌లో భా గంగా విశాఖపట్నంలోని దశ పల్లా హోటల్‌లో చిత్ర యూ నిట్ మీడియా సమావేశాన్ని నిర్వహించింది. ఈ సంద ర్భంగా నిర్మాత నిహారిక కొణిదెల మాట్లాడుతూ, 'కమిటీ కుర్రాళ్లు' వంటి భారీ విజయం తర్వాత తమ పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ బ్యానర్‌పై వ స్తున్న మరో వైవిధ్యమైన చిత్రం 'రాకాస' అని తెలిపారు. విశాఖ పట్నం బీచ్ అంటే తనకు ఎంతో ఇష్ట మని, అందుకే ఇక్క డికి షిఫ్ట్ అయి పోవాలని ఎప్పుడూ అనుకుంటానని ఆమె చమత్కరించారు. ఈ చిత్రంలో కామెడీ చాలా నిజాయితీగా ఉంటుందని, బ్రహ్మాజీ, తనికెళ్ళ భరణి వంటి సీనియర్ నటుల రాకతో సినిమా స్థాయి పెరిగిందని పేర్కొన్నారు. హీరో సంగీత్‌తో తనకు ఇది రెండో సినిమా అని ఆమె గుర్తు చేశారు. హీరో సంగీత్ శోభన్ మాట్లాడుతూ, ఇది ఒక ఫాంటసీ కామెడీ చిత్రమని, ఇందులో హారర్ థ్రిల్లర్ ఎలిమెంట్స్ కూడా ఉంటాయని తెలిపారు.

దర్శకుడు విఠలాచార్య తీసిన పాత చిత్రాల మాదిరిగా, ఒక 'చందమామ కథ' విన్నట్టుగా ఈ సినిమా ఉంటుందని, ఫైనల్‌గా ఇదొక క్యూట్ లవ్ స్టోరీ అని వివరిం చారు. హీరోయిన్ నయన్ సారిక మాట్లాడుతూ, సినిమా ప్రమోషన్స్ విశాఖ నుంచే ప్రారంభించడం సం తోషంగా ఉందన్నారు. ఈ సినిమాను పిల్లలు, పెద్దలు అం దరూ కలిసి ఎంజాయ్ చేయ వచ్చని తెలి పారు. నటుడు గెటప్ శ్రీను మాట్లాడుతూ, ఫాంటసీ కామెడీ బాగా పండిందని, హీరో సంగీత్ తన నటనతో అదరగొట్టారని కొనియాడారు. దర్శకురాలు మానస శర్మ ఈ చిత్రాన్ని అద్భుతంగా తెరకెక్కించారని చిత్ర బృందం ప్రశంసించింది. జీ స్టూడియోస్ సమర్పణలో రూపొందిన ఈ చిత్రం సమ్మర్ కానుకగా ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమైంది. ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులు పాల్గొన్నారు.

# 'పెద్ది'లో మృణాల్ ఠాకూర్ ఐటమ్ సాంగ్..?

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్, డైరెక్టర్ బుచ్చిబాబు సానా కాంబినేషన్‌లో వస్తున్న భారీ యాక్షన్ డ్రామా 'పెద్ది' సినిమాపై ఓ ఆసక్తికర ప్రచారం జరుగుతోంది. ఈ చిత్రంలోని ఓ ప్రత్యేక గీతంలో ప్రముఖ నటి మృణాల్ ఠాకూర్ కనిపించనున్నట్లు ఇండస్ట్రీ వర్గాల్లో జోరుగా ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

ఈ స్పెషల్ సాంగ్‌లో మృణాల్‌తో పాటు మరో ఇద్దరు హీరోయిన్లు కూడా ఉంటారని కొందరు అంటుండగా, కేవలం ఆమె మాత్రమే ఉంటుందని మరికొన్ని వార్తలు వినిపిస్తున్నాయి. అయితే, ఈ వార్తలపై చిత్రబృందం నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. ప్రస్తుతం 'పెద్ది' చివరి దశ షూటింగ్, పోస్ట్ ప్రొడక్షన్ పనులతో శరవేగంగా ముందుకు సాగుతోంది. ఈ చిత్రంలో జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, శివ రాజ్‌కుమార్, జగపతి బాబు, దివ్యేందు, బోమన్ ఇరానీ వంటి సీనియర్ నటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఆర్ రత్నవేలు సినిమాటోగ్రఫీ, నవీన్ నూలి ఎడిటింగ్ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.






# ధురంధర్-2 చిత్రంపై నాగార్జున ప్రశంసలు



టాలీవుడ్ సీనియర్ హీరో అక్కినేని నాగార్జున ఇటీవల బాలీవుడ్ బాక్సాఫీస్ వద్ద సంచలనం సృష్టిస్తున్న 'ధురంధర్: ది రివెంజ్' చిత్రంపై ప్రశంసల వర్షం కురిపించారు. ఒక అద్భుతమైన సినిమా చూశాను! వాట్ ఏ రైడ్! ఈ సినిమా నా మతి పోగొట్టింది. చూసినప్పటి నుంచి ఇప్పటికీ దాని గురించే ఆలోచిస్తున్నాను, ఆ ప్రభావం నుంచి బయటకు రాలేకపో తున్నాను. భారతీయ సినిమా నిర్మాణ శైలిని మార్చేసే అరుదైన చిత్రాల్లో ఇది ఒకటిగా నిలిచిపోతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ చిత్రానికి 'ఉరి' ఫేమ్ ఆదిత్య ధర్ దర్శకత్వం వహించగా, రణ్‌వీర్ సింగ్ ప్రధాన పాత్రలో నటించారు. దర్శకుడి విజన్‌ను నాగార్జున ప్రత్యేకంగా అభినందించారు. సినిమాలోని హైపర్-స్టైలైజ్డ్ యాక్షన్, సంగీతం, సౌండ్ డిజైన్, కెమెరా పనితనం అంతర్జాతీయ స్థాయిలో ఉన్నాయని కొనియాడారు. సాంకేతిక నిపుణులతో పాటు నటీనటులందరూ తమ పాత్రల్లో జీవించేశారని, ప్రతి ఒక్కరూ అదరగొట్టారని నాగార్జున ప్రశంసించారు. జాతీయవాదం, యాక్షన్ అంశాల కలయికతో ఈ ఫ్రాంచైజీ ప్రేక్షకులను కట్టిపడేస్తోందని ఆయన తెలిపారు.

ఈ గొప్ప చిత్రానికి మా అన్నపూర్ణ స్టూడియోస్ హైదరాబాద్ డాల్బీ సినిమా ప్రాసెసింగ్‌తో పాటు, సౌత్ ఇండియన్ భాషల లోకలైజేషన్ సేవలను అందించిందని చెప్పడానికి నేను చాలా గర్వపడుతున్నాను" అంటూ నాగార్జున తన ట్వీట్ లో పేర్కొన్నారు. అంతేకాకుండా, ఈ చిత్రం దక్షిణాది భాషల్లోకి డబ్బింగ్ అయ్యే ప్రక్రియలో కూడా అన్నపూర్ణ స్టూడియోస్ కీలక పాత్ర పోషించింది. ఇంతటి గొప్ప చిత్రంలో తమ స్టూడియో భాగస్వామి కావడం సంతోషంగా ఉందని ఆయన అన్నారు. ప్రస్తుతం ఈ సినిమా అన్ని భాషల్లోనూ భారీ వసూళ్లతో దూసుకుపోతోంది. పలువురు సినీ ప్రముఖులు సైతం ఈ సినిమాపై ప్రశంసలు కురిపిస్తున్నారు.

Edited, Printed, Published & Owned by **LEKKALA SREENU** and Published from D.NO: 4-14/5-201, Revenue Ward NO. 57, Aganampudi, Near Toll Gate, Duvvada, Talarivanipalem,VISAKHAPATNAM, AP-530049 and Printed at **Guddapuvalasa Ramani**, D.No. 18-135/1/1, Opp. Apollo Hospital, Pedagadhili, VISAKHAPATNAM, A.P.-530040. E-mail: Pathakamnews.ap@gmail.com, **Mobile No: 7097975757, Reg No. APTEL/25/A2082**